ఆంధ్రజ్యోతి ****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 31 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	230
సూర్యాపేట	రూ.140	200	230
నల్లగొండ	రూ.140	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 23.0



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న స్పీకర్లు గడ్డం ప్రసాద్‌కుమార్

గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సన్నబియ్యం పథకంతో చరిత్రలో హుజూర్‌నగర్

- సీఎం రేవంత్‌రెడ్డి
- దేశమంతా హుజూర్‌నగర్ వైపు చూసేలా సభ : మంత్రి ఉత్తమ్

నల్లగొండ/సూర్యాపేట/కోదాడ/హుజూర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశంలో ఎక్కడా లేని రీతిలో ఉగాది రోజున పేదలకు సేవచేయాలనే సత్సంకల్పంతో హుజూర్‌నగర్ గడ్డ నుంచి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించాం.. ఈ ఘట్టానికి వేదికైన హుజూర్‌నగర్ చరిత్రలో నిలిచిపోతుంది.. రోటీ, కపడా, మకాన్ పథకాలు, బలహీనవర్గాలకు భూపంపిణీ చేయడం ద్వారా ఇందిరమ్మ, పేదలకు తెల్లన్నం అందించిన విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎన్టీఆర్, దేశంలో పేదలందరికీ ఆహారభద్రత ఉండాలనే లక్ష్యంతో సోనియాగాంధీ రూపొందించిన ఆహారభద్రత పథకం ఎలాగైతే చరిత్రలో నిలిచిందో... ఈ రోజు తెలంగాణ ప్రభుత్వం నుంచి తాము ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం అలాగే చరిత్రలో నిలిచి పోతుంది.. ఈ పథకాన్ని ప్రారంభించిన హుజూర్‌నగర్ గడ్డ చరిత్రలో నిలుస్తుంది' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్లగొండ ఉమ్మడి జిల్లా చైతన్యవంతమైన ప్రాంతమని, నిజాములను, రజాకార్లను ఎదరించి పోరాడిన చాకలి ఐలమ్మ, దొడ్డికొమరయ్య, ధర్మభిక్షం, బీఎన్‌రెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి యోధులున్న గడ్డని కొనియాడారు. నాడు తొలి లోకసభలో నల్లగొండ నుంచి ప్రాతినిధ్యం వహించిన రావి నారాయణరెడ్డికి దేశంలోనే నెహ్రూకంటే కూడా అత్యధిక మెజార్టీ ఇచ్చారని, ఆ తర్వాత మళ్లీ మొన్నటి ఎన్నికల్లో ఇక్కడి ఎంపీ రఘువీర్‌కు దక్షిణ భారతదేశంలోనే అత్యధిక మెజార్టీ అందించారని, అందులో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి లక్ష చొప్పున మెజార్టీలు సాధిస్తామని చెప్పి ఉత్తమ్, పద్మావతి దంపతులు చేసి చూపించారని కొనియాడారు. ఈ రోజు సభకు వచ్చిన జనాన్ని, ఆడబిడ్డలను చూస్తుంటే ఉత్తమ్, పద్మావతి ఇక్కడి ప్రజలను కుటుంబంగా భావించిన తీరు అర్థమవుతోందని ప్రశంసించారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ హయాంలోనే నాగార్జునసాగర్ కట్టించారని, శ్రీశైలం ప్రాజెక్టు కట్టింది కాంగ్రెస్సేనని, ఈ జిల్లాకు ఉద్దేశించిన ఎస్ఎల్‌బీసీ, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాలే కట్టాయన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టును నాడు వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు జిల్లా నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొట్లాడి తెచ్చారని, 43కిలోమీటర్ల సొరంగానికి 34కిలోమీటర్లు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తవ్వితే, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీకి ఈ జిల్లా ప్రాజెక్టులు, నీళ్ల అవసరం లేదని, ఇక్కడి ఓట్లు, సీట్లు మాత్రం కావాలని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి పండేది ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే అని, ఇక్కడ 12లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని, అత్యధికంగా రుణమాఫీ, సన్న ధాన్యానికి ఇచ్చే బోనస్ కూడా ఈ జిల్లాకే ఎక్కువగా వచ్చాయన్నారు.

80శాతం మంది ప్రజలకు ఉచిత బియ్యం : మంత్రి ఉత్తమ్

దేశ స్వాతంత్ర్య చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా 80శాతం ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇచ్చే పథకం అమలు చేయలేదని, మొదటిసారి రాష్ట్రంలో తాము అమలు చేస్తున్నామని, దేశమంతా హుజూర్‌నగర్ వైపు చూసేలా ఈ పథకాన్ని ఇక్కడ ప్రారంభించామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ కింద దొడ్డురకం బియ్యం ఇస్తుంటే, అది దుర్వినియోగమవుతున్న విషయాన్ని తాము గుర్తించి, సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చించామని, వారి మార్గదర్శకాలతో ఈ రోజు నుంచి రాష్ట్రంలో రేషన్ కింద సన్నబియ్యం ఇచ్చే కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఈ సభకు హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి మహిళలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారని పేర్కొన్నారు. కమర్షియల్ పాలిటిక్స్ కొనసాగుతున్న ఈ రోజుల్లో తనపై గౌరవంతో, ప్రేమతో వచ్చిన హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో కార్యకర్తలను ఏవిధంగా హింసించారో, పోలీస్ కేసులు ఎలా పెట్టి వేధించారో అందుకు మిత్తి సహా చెల్లిస్తామని హెచ్చరించారు. తమ్మారం, పీక్యాతండా ఘటన...

- మిగతా 7వ పేజీలో...



సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

సీఎం సభకు హాజరైన ప్రజలు

సీఎం పర్యటన సాగిందిలా...

- 5.45గంటలకు హెలీప్యాడ్‌లో దిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- 6.05 : మోడల్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పరిశీలన
- 6.12: మోడల్‌కాలనీ నుంచి సభావేదిక వద్దకు బయల్దేరిన సీఎం కాన్వాయ్
- 6.20: సభాప్రాంగణానికి చేరుకున్న సీఎం
- 6.22: సభావేదికపై సీఎంకు స్వాగతం పలికి శాలువా కప్పిన ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్
- 6.25:జయజయహే తెలంగాణ గీతాలాపన
- 6.30: లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసిన సీఎం, అనంతరం ప్రసంగం, 33 నిమిషాల పాటు మాట్లాడిన సీఎం
- 7.30కు సభావేదిక నుంచి సీఎం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు పయనం
- అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్ ఎమ్మెల్సీలుగా ఈ రోజు నుంచి బాధ్యతల్లోకి వచ్చారని ప్రస్తావించిన సీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సీఎం ప్రసంగంలో మాజీ మంత్రి జానారెడ్డి గురించి రెండు సందర్భాల్లో ప్రస్తావించడంతోపాటు, టీడీపీ సిద్ధాంతాల రూపకల్పనలో భాగస్వామ్యమైన కేవీ. సత్యనారాయణ పేరును కూడా సీఎం ప్రస్తావించారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాల్లో భక్తుల సందడి
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు, అలరించిన కవి సమ్మేళనాలు



బీఆర్ఎస్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరాది సందర్భంగా ఉగాది వేడుకలను జిలావ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రజలు సమీప ఆలయాలకు చేరుకుని ఇష్టా దైవానికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో ఆలయాన్ని భక్తులతో కిటకిటలాడాయి. గృహాలు, వ్యాపార సంస్థలను మామిడి తోరణాలతో అలంకరించి పూజల అనంతరం, తీపి, చేదు, కారం, ఉప్పు, పులుపు, వగరుల మిశ్రమంతో తయారు చేసిన షడ్రుచుల ఉగాది పచ్చడిని మహా ప్రసాదంగా స్వీకరించారు. బంధువులకు, స్నేహితులకు ఉగాది పచ్చడి వితరణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల ఉగాది కవి సమ్మేళనాలు నిర్వహించారు. సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో యూటీఎఫ్ కార్యాలయంలో కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

వ్యవసాయ పరికరాల పంపిణీకి సన్నాహాలు



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి తొలి విడతగా ఉమ్మడి జిల్లాలో 1,552మంది రైతులకు రూ.3.59కోట్లు కేటాయించింది. ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకాన్ని నిరంతర ప్రక్రియగా చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించి కార్యచరణ అమలుచేస్తోంది. ఇప్పటి వరకు 50కిపైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండగా, వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ మాసంలో రైతులకు పరికరాలు అందజేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ
- ఏప్రిల్‌లో పంపిణీకి ఏర్పాట్లు
- తొలి విడతకు ఇప్పటికే 50శాతం పైగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 1,552మంది లబ్ధిదారులు

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తీసుకువచ్చింది. కాగా, ఈ పథకం ఆరేళ్లుగా నిలిచిపోవడంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశం లేకుండా పోయింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసాగింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్ల సుమారు రూ.50కోట్లు కేటాయించింది. అయితే యాంత్రీకరణ పథకంలో అత్యధికంగా ట్రాక్టర్లను మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్లు అధికంగా టీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారన్నా ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున రావడంతో పథకం అబాసుపాలైంది. మరి కొన్ని పరికరాలను కూడా రాయితీపై ఇచ్చినా రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. పథకం అమలు విమర్శలపాలు కావడంతో అప్పటి 2018లో అప్పటి ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. ఆ తరువాత రైతులు, రైతు సంఘాల నేతలు ఈ పథకం అమలు కోసం డిమాండ్ చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని తిరిగి అమలులోకి తీసుకురాలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పునరుద్ధరించింది.

వచ్చే నెలలో రాయితీపై యంత్రాలు...

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు నిర్ణయించడమేగాక ఈ యాసంగిని నుంచే రైతులకు రాయితీపై యంత్రాలు అందజేయాలని భావించింది. అయితే కొంత ఆలస్యం కాగా, సీజన్ ముగిసేలోగా ఈ నెలాఖరు వరకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వచ్చే నెలలో పరికరాలు కేటాయించనున్నారు. రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరాకు జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల...

- మిగతా 7వ పేజీలో...

నేడు ఈదుల్ ఫితర్

- సామూహిక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు
- ముగిసిన ఉపవాస దీక్షలు



జిల్లా కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మునుగోడు రోడ్డులోని ఈద్గా

నల్లగొండ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెలవంక ఆదివారం కనిపించడంతో ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగను ముస్లింలు సోమవారం నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు ఆదివారం ఇఫ్తార్‌తో దీక్షలను విరమించారు. సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగకు అంతా సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రం మునుగోడురోడ్‌లోని ఈద్గాలో సామూహిక ప్రార్థనల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరవుతున్నందున పోలీస్‌శాఖ కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం 8.30గంటలకు ఈద్గాలో సామూహిక ప్రార్థనలు ఉంటాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు. పండుగ సందర్భంగా ప్రతీ ముస్లిం ఇంటా షీర్ ఖుర్మా తయారు చేసేందుకు సామగ్రి కొనుగోలు, అదేవిధంగా కొత్త దుస్తుల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. పేద ముస్లింలకు ఇప్పటికే ఫిత్రా, జకాత్‌ను, పలు సంస్థలు పండుగ సామగ్రిని పంపిణీచేశాయి. రంజాన్ మాస ప్రత్యేక వంటకం హరీస్, హలీం తయారుచేసే కేంద్రాలు పండుగ అనంతరం మూతపడనుండటంతో ఆదివారం సాయంత్రం ఇవి బిజీగా మారాయి. కాగా, రంజాన్ రోజున ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద ఏర్పాట్లను ముస్లిం మత పెద్దలు, పలువురు అధికారులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు.

రేపటి నుంచి వ్యవసాయశాఖలో కొత్త సెల్ నెంబర్లు

నల్లగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులకు కొత్త సెల్‌ఫోన్ నెంబర్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జేడీఏ పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న నెంబర్ల స్థానంలో కొత్త నెంబర్లు అందుబాటులోకి రానున్నాయి. జేడీఏ, ఏడీఏలు, ఎంఏవోలు, టెక్నికల్ ఆఫీసర్లు, ఏవోల నెంబర్లు మారాయి.

అధికారి	కొత్త నెంబర్
జిల్లా వ్యవసాయాధికారి	8977751294
నల్లగొండ ఏడీఏ-టీ(డీఏవో)	8977751295
దేవరకొండ ఏడీఏ	8977751306
హాలియా ఏడీఏ	8977751330
మిర్యాలగూడ ఏడీఏ	8977751358
మునుగోడు ఏడీఏ	8977751370
నకిరేకల్ ఏడీఏ	8977751427
నల్లగొండ ఏడీఏ	8977751449
డీడీఏఎఫ్‌టీసీ నల్లగొండ	8977751458

మల్లాచారికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న మల్లాచారి

కనగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశీపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ ముఖ్య అర్చకుడు నాగోజు మల్లాచారికి ఉగాది పురస్కారం లభించింది. రాష్ట్ర భాషాసాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయశాఖ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీవిశ్వావసునామ సంవత్సరం ఉగాది సందర్భంగా నిర్వహించిన పంచాంగ శ్రావణం మల్లాచారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉగాది పురస్కారం అందజేసి సన్మానించారు. కాగా, పురస్కారం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని, తనను ఎంపిక చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ప్రాంతానికి వరమైన శ్రీరాంసాగర్ రెండో దశ సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలకు సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కాల్వలు తవ్వారు. ఈ ఆయకట్టు కింద 2.13 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంగా 69, 70, 71 డిస్ట్రిబ్యూటర్లు నిర్మించారు. రూ.1,100 నిధుల ప్రతిపాదనలతో 1996 మార్చి 6వ తేదీన అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎస్సారెస్పీ రెండో దశ కాల్వ పనులకు తిరుమలగిరి మండలం ప్రగతినగర్ వద్ద శంకుస్థాపన చేశారు. 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా శ్రీరాంసాగర్ రెండో దశ పనులు చేపట్టి కాల్వలను తవ్వించారు.


- (ఆంధ్రజ్యోతి,అర్వపల్లి)


అర్వపల్లిలో కంప చెట్లతో నిండిన ఉపకాల్వ

కాల్వలకు నీరందేనా?

మూడు డ్రిస్టిబ్యూటర్లు

ప్రధానకాల్వ తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలం వెలిశాలలో ప్రారంభమైంది. ప్రగతినగర్ ముందు ముగుస్తుంది. 69, 70, 71మెయిన్ డ్రిస్టిబ్యూటర్ల కాల్వలు ఉన్నాయి. 70డ్రిస్టిబ్యూటర్ ఎనిమిది కిలో మీటర్ల మేర ఉంది. కాల్వ నిర్మించేటప్పుడు లైనింగ్ నిర్మాణం కూడా చేపట్టారు. 69డీబీఎం కాల్వ వెలిశాల నుంచి మొదలవుతుంది. మొత్తం 27కిలో మీటర్లు ఉండగా 2004లో కొంత మేర లైనింగ్ పనులు చేపట్టారు. మిగతా లైనింగ్ పనులు పూర్తి కాలేదు. ఉప కాల్వలు మొత్తం లైనింగ్ నేటివరకు మర మ్మతులకు నోచకపోవడంతో కంపచెట్లతో నిండి, మట్టి కూరుకపోయి అస్తవ్యస్తంగా మారాయి. 69డీబీఎం కింద 69వేల 956ఎకరాలకు ఆయ కట్టుఉంది. నూతనకల్, తుంగతుర్తి, మద్దిరాల మండలాలకు నీరు ప్రవహిస్తుంది. కాల్వలు సరిగాలేక చివరి భూములకు నీరందడం లేదు.



సాగర్ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	521.70
టీఎంసీలు	152.3944
ఎడమకాల్వకు నీటి విడుదల	7190
కుడికాల్వకు	5088
విద్యుత్ కేంద్రం ద్వారా	0
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1300 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	0
అవుట్‌ఫ్లో	13,938 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	600 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	624.30 అడుగులు
టీఎంసీలు	0.78
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	453.28 క్యూసెక్కులు

శ్రీరాంసాగర్ రెండో దశలో పెద్ద 71డీబీఎం కాల్వ

71డీబీఎం కాల్వ నాగారం మండలం ప్రగతి నగర్ నుంచి మొదలవుతుంది. ఈ కాల్వ తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలల్లోని చెరువులకు అనుసంధానం చేశారు. చెరువులు, ఉప కాల్వల ద్వారా పంటలకు సాగు నీరు విడుదల చేస్తున్నారు. 71డీబీఎం మెయిన్ కాల్వ కింద 1.44లక్షల ఎకరాలకు నీరు సరఫరా చేస్తున్నారు. 25ఏళ్లలో ఈ కాల్వ మరమ్మతులకు రూ.200కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మెయిన్ కాల్వ కింద 1-ఆర్ నుంచి 18ఉప కాల్వలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామ సమీపంలో 11-ఆర్ ఉపకాల్వ పూర్తిగా పటిష్టత కోల్పోయి పది రోజుల క్రితం తెగి సుమారుగా 80శాతం నీరు రామన్నగూడెం గ్రామ రహదారి పైకి నీరు చేరి అస్తవ్యస్తంగా మారింది.

రహదారిపై వృథాగా నీరు

గోదావరి జలాలు విడుదల చేసినప్పుడల్లా సూర్యాపేట మండలం రాజానాయక్ తండా వద్ద సూర్యాపేట-జనగాం రహదారిపై నీరు వృథా వెళ్తున్నా ఎస్సారెస్పీ అధికారులు పట్టించుకోవడంలేదు. 71డీబీఎం మెయిన్ కాల్వ పొడవు 69కిలో మీటర్లు తవ్వి నీటిని విడుదల చేస్తున్నారు. ఆధునికీకరణకు రూ.11కోట్లతో లైనింగ్ పనులు నాగారం మండలం బంగ్లా సమీపం నుంచి జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామ సమీపంలోని గోపాల్‌రెడ్డి నగర్ వరకు 8కిలో మీటర్లు పదేళ్ల క్రితం లైనింగ్ పనులు తూతూ మంత్రంగా చేపట్టి 60కిలో మీటర్లు నేటి వరకు లైనింగ్ పనులు చేపట్టలేదు. వర్షాలు వచ్చినప్పుడల్లా లైనింగ్ పనులు లేకపోవడంతో కోతకు గురై కాల్వ బాగా దెబ్బతింటుంది. మెయిన్ కాల్వ కింద ఉన్న ఉపకాల్వలు చెట్లతో నిండి అధ్వానంగా మారాయి. 25ఏళ్లుగా ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, మోతె, గరిడేపల్లి, నడిగూడెం మండలాల చివరి భూములకు నీరు అందడం లేదు.

ప్రతిపాదనలు.. కాగితాలకే పరిమితం

గత ప్రభుత్వం శ్రీరాంసాగర్ కాల్వల ఆధునికీకరణకు రూ.300కోట్ల ప్రతిపాదనలు పంపినా నేటి వరకు రెండో దశ ఆయకట్టు నిధులు మంజూరు కాగితాలకే పరిమిత మైంది. ప్రస్తుత భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో నిధులు కేటాయించి శ్రీరాంసాగర్ రెండో దశ 69, 70, 71డీబీఎం 25ఏళ్ల కల నెరవేరుతుందని రైతులు ఆశిస్తున్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అసెంబ్లీలో శ్రీరాంసాగర్ ఆధునీకరణ పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.


సీసీ లైనింగ్‌కు నోచని ప్రధాన కాల్వ

రెండు వారాలు నీరు విడుదల చేస్తే..

సూర్యాపేట జిల్లాకు మరో రెండు వారాల పాటు గోదావరిజలాలు విడుదల చేస్తే పూర్తిస్థాయిలో వరి పంట చేతికి వచ్చే అవకాశముంది. ఇప్పటికే లక్ష ఎకరాల్లో వరి పంట పొట్టదశలో ఉంది. రెండు వారాల పాటు శ్రీరాంసాగర్ రెండో దశ ఆయకట్టుకు 1500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే రైతుల పంటలు చేతికి వచ్చే అవకాశముంది. వార బందీలో భాగంగా అధికారుల ప్రణాళికలో ఏప్రిల్ నెలలో నీరు విడుదల చేసే అవకాశం లేదంటున్నారు. నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



నీరు విడుదల చేయాలి

శ్రీరాంసాగర్ నీటిని రెండు వారాల పాటు విడుదల చేయాలి. వరి పొలాలు పొట్ట దశలో ఉన్నందున నీరు విడుదల కాకపోవడంతో ఎండిపోయే పరిస్థితి నెలకొంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి నీటిని విడుదల చేయాలి.

● పులిచర్ల యాదగిరి అర్వపల్లి గ్రామం జాజిరెడ్డిగూడెం.

కాల్వలను ఆధునికీకరించాలి

శ్రీరాంసాగర్ రెండో దశ ఆధునీకరణ కోసం నిధులు కేటాయించి మరమ్మత్తులు చేపట్టాలి. మెయిన్ కాల్వ లైనింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి. 25ఏళ్లుగా మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో చివరి భూములకు నీరు అందడం లేదు.

● కుంభం యాగయ్య రైతు, జాజిరెడ్డిగూడెం.



సాగర్ ఎడమ కాల్వలో వ్యక్తి గల్లంతు

● తమిళనాడు వాసిగా గుర్తింపు

నిడమనూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో జారి పడి గల్లంతయ్యాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం వద్ద ఆదివారం జరిగింది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లా చెంగం ప్రాంతానికి చెందిన పచాయప్పన్(26), విగ్నేష్, అంబారసన్‌లతో పాటు మరికొందరు యాసంగి సీజన్‌లో వరి పొలాలు కోసేందుకు రెండు కోత మిషన్లు(హార్వెస్టర్లు) తీసుకొచ్చి ఈ నెల 17 నుంచి ముప్పారం గ్రామంలో ఉంటూ పొలాలు కోస్తున్నారు. పచాయప్పన్ మిషన్ డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో పచాయప్పన్, విగ్నేష్, అంబారసన్ ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వద్దకు స్నానం చేసేందుకు వెళ్లారు. విగ్నేష్ కాల్వకట్ట మీద ఉండగా, పచాయప్పన్, అంబారసన్ కాల్వలోకి దిగి దుస్తులు విప్పి కాళ్లు, చేతులు కడుక్కుంటూ ఉండగా ప్రమాదవశాత్తు పచాయప్పన్ కాలు జారి కాల్వలో పడిపోయాడు. విగ్నేష్, అంబారసన్‌లు అతనిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ పచాయప్పన్‌కు ఈత రాకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. తోటి వ్యక్తులు, పోలీసులు ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఉపాధి కోసం తమతో పాటు వచ్చిన తోటి మిత్రుడు తమ కళ్లెదుటే కాల్వలో పడి నీటిలో కొట్టుకుపోవడంతో బోరున విలపిస్తున్నారు. పచాయప్పన్‌కు పెళ్లి కాగా ప్రస్తుతం భార్య నిండు గర్భిణి. అంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో మరో ఐదుగురి అరెస్టు

నకిరేకల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో మరో ఐదుగురిని పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. ఇప్పటి వరకు ఈ కేసు విషయంలో 11మందిని అరెస్టు చేసినట్లు నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో పోగుల శ్రీరాములు, తలారి అఖిలేష్ కుమార్, పల్లా మనోహర్, ముత్యాల వంశీ, పల్సా అనిల్‌కుమార్ ఉన్నారు.

గుంటుకగూడెంలో వివాహిత అదృశ్యం


శ్రావణి (ఫైల్)


నిడమనూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పండుగకు పుట్టింటికి వచ్చిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని గుంటుకగూడెంలో జరిగింది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం అమ్మగూడెం గ్రామానికి చెందిన కొండా శ్రావణి(22) అనే వివాహిత తన భర్తతో కలిసి ఉగాది పండుగ కోసం అమ్మగారి ఊరైన మండలంలోని గుంటుకగూడెం గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో శనివారం రాత్రి 11గంటల సమయంలో బాత్రూంకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి కూరపాటి వెంకన్న నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


నరసింహ(ఫైల్)

చింతపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో నెల్వలపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నెల్వలపల్లి గ్రామానికి చెందిన నర్రావుల నరసింహ(65) ఈ నెల 28న పని నిమిత్తం బైక్‌పై చింతపల్లికి వచ్చాడు. తిరుగు పయనంలో చింతపల్లి నుంచి మల్లేపల్లి వైపునకు వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి మల్లేపల్లికి వెళ్తున్న డీసీఎం బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో నరసింహకు తీవ్ర గాయాల య్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ నరసింహ మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ దుకాణాలకు చేరిన సన్నబియ్యం



మర్రిగూడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో సన్న బియ్యం రేషన్ దుకాణాలకు చేరుకున్నాయి. మండలంలోని 24 ప్రభుత్వ చౌకధర దుకాణాల్లో పౌరసరఫరాల అధికారులు బియ్యాన్ని చేర్చారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతీ లబ్ధిదారునికి అందజేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయా చౌకధరల దుకాణాల డీలర్లు ఈ సన్నబియ్యాన్ని పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. దుకాణాల వద్ద ఎలాంటి సమస్యలకు తావు ఇవ్వకుండా బియ్యాన్ని లబ్ధిదారులు తీసుకెళ్లడానికి సిద్ధం చేసినట్లు తెలిపారు.

యాదగిరిగుట్టలో ఉగాది వేడుకలు


యాదగిరిగుట్టకొండపై పంచాంగ శ్రవణంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట మార్చి 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలు అర్చక, అధికార బృందం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. వైకుపజామునే ప్రధానాలయంలోని స్వయంభువులను కొలిచిన పూజారులు ఆలయంలో కవచమూర్తులను సువర్ణపుష్పాలతో అర్చించారు. కల్యాణ మండపంలో ప్రత్యేకవేదికపై అధిష్టంపజేసి తూర్పు రాజగోపురం వద్దకు సాయంత్రం ఐదున్నర గంటలకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది వేడుకల్లో భాగంగా ఆస్థాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణశర్మ పంచాంగ శ్రవణం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పుష్కలంగ పండుతాయని వివరించారు. సూర్య భగవానుడు, గురువు, కుజుడు, మిత్రుత్వంలో సశ్యమామలంగా ప్రకృతి వర్ధినలని శ్రావణం చేశారు. విశ్వశాంతి, లోక కల్యాణం కోసం ఇక్కడ కొండగుహలో వెలిసిన లక్ష్మీ నరసింహుల ఆదాయం కన్నా వ్యయం అధికంగా ఉన్నాయన్నారు. విశ్వావస నామ సంవత్సరంలో స్వామివారు నారసింహుడి తులరాశి ఆదాయం-11, వ్యయం-5, అమ్మవారు సింహరాశి ఆదాయం -11, వ్యయం -11గా ఉన్నాయని ఆయన వివరించారు.


కొండపైన సాంస్కృతిక కార్యక్రమాలు

భక్తుల రద్దీ సాధారణం

కల్యాణోత్సవంలో పరిమితంగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ తిరువీధులు, శివాలయం, బస్టాండ్ భక్తులు సాధారణంగా ఉన్నారు. ఉగాది పర్వదినాన భక్తులు ఉభయ క్యూలైన్లో భక్తులు స్వామివారి ఆరగింపు సమయం వరకు కొనసాగారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 25,37,411 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు, అనుశంశిక ధర్మ భాస్కరాయని నరసింహమూర్తి, ప్రధాన అర్చకులు నల్లనీదిగల్ లక్ష్మీ నరసింహచార్యులు డీఈవో దోర్బల భాస్కరశర్మ పాల్గొన్నారు.

శాలిలింగోటంలో వేప చెట్టుకు కల్లు

● నల్లగొండ జిల్లాలో సంఘటన

శాలిగౌరారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తాటి, ఈత చెట్టుకు కల్లు వస్తదని అందరికీ తెలుసు. కాని వేప చెట్టుకు కల్లు వచ్చిన అరుదైన సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం శాలిలింగోటంలో జరిగింది. శాలిలింగోటం గ్రామానికి చెందిన గీతా కార్మికుడు బండారు లక్ష్మయ్య వ్యవసాయ క్షేత్రంలో ఒక వేప చెట్టు ఉంది. పది రోజుల నుంచి ఈ చెట్టు కాండం నుంచి మూడు చోట్ల తెల్లగా ఊట కారడం మొదలైంది. వెంటనే ఈ విషయాన్ని కొంతమందికి చెప్పాడు. ఇది వేప కల్లు అని పలువురు చెప్పడంతో కల్లు కారే ప్రదేశం పరీక్షించాడు. కారే కల్లు అంతా కింద పోతుందని భావించి కింద ఒక లొట్టి పెట్టి చెట్టు కాండ ద్వారా కల్లు కింద పడకుండా ఒక డొప్పను తయారు చేసి లొట్టిలో కల్లు పడే విధంగా చేశాడు. రోజుకు మూడు లీటర్ల వరకు వేప కల్లు అవుతుంది.

ఈ సందర్భంగా బండారు లక్ష్మయ్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వేప చెట్టుకు కల్లు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇక్కడ ఈ చెట్టుకు కల్లు రావడం చూసి కొంతమంది వచ్చి కల్లు పోయాలని, అడుగుతున్నారని, రోజు ఉదయం 8గంటలకు కల్లును విడుస్తానని తెలిపారు. వేపకల్లు చేదుగా ఉందని ఆరోగ్యానికి మంచిదని రోజు కొంతమంది వేప కల్లు కావాలని తనకు ఫోన్ చేస్తున్నారని తెలిపారు.




శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటం గ్రామంలో కల్లు పారే వేప చెట్టు, కల్లు పారుతున్న వేప చెట్టు

ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత

డిండి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను నల్లగొండ జిల్లా డిండి పట్టుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి ప్రాజెక్టు ఎగువన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం చింతపల్లి వాగు నుంచి ఇసుక తోడి అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను డిండి మండలం కొత్త తండా శివారులో ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వంగూర్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు కేశగోని హరీష్, బట్టమేకల చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

డేంజర్ స్పాట్ దయ్యాలగండి

● అసలే మలుపులు.. ఆపై ఇరుకు రోడ్డు ● 15 సంవత్సరాల్లో 32 ప్రమాదాలు ● 10 మంది మృత్యువాత


దయ్యాలగండి వద్ద ప్రమాదం జరిగిన స్థలం(ఫైల్)

నాగార్జునసాగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌కు గొప్ప పేరుంది. అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతుండడంతో ప్రతి సంవత్సరం దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు సాగర్‌ను చూసేందుకు వస్తుంటారు. ఇక్కడ రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి-565 నిత్యం రద్దీగా ఉంటుంది. సాగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మొదటి ఘాట్ వద్ద దయ్యాల గండి అనే ప్రాంతం వద్ద రోడ్డు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. సాగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో సమ్మక్క-సారక్క జంక్షన్ నుంచి ఫైలాన్ కాలనీ వరకు మొత్తం ఎనిమిది మూల మలుపులు ఉంటాయి. ఈ మూల మలుపుల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఎక్కువ ప్రమాదాలు మాత్రం దయ్యాలగండి వద్ద జరుగుతున్నాయి. ఇక్కడ మూల మలుపుతో పాటు రోడ్డుకు దగ్గరగా విద్యుత్ స్తంభాలు ఉండడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకుండా చెట్లు అడ్డుగా ఉన్నాయి. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.

రోడ్డు విస్తరణకు నో..

సాగర్‌కు వెళ్లే దారిలో ఉన్న మూల మలుపులు సరిచేసి రోడ్డును విస్తరించడానికి అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఇరుకుగా ఉందని, రోడ్డుకు అడ్డుగా పెరిగిన చెట్లను బీఅండ్‌ఆర్ అధికారులు చెట్లను తొలగించకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఇక్కడ రోడ్డు దిగుడుగా(డౌన్) ఉంటుంది. రోడ్డు పక్కనే రెండు విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనాలు పక్కకు వెళ్లడానికి అవకాశం లేదు. విద్యుత్ స్తంభాలు కూడా తరచూ ప్రమాదాలు జరగడానికి మరో కారణం. ప్రమాదాల నివారణకు దయ్యాలగండి వద్ద ఫ్లైఓవర్ వేస్తే అటవీ శాఖకు ఎటువంటి నష్టం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. అసలే మలుపులు ఆపై ఇరుకు రోడ్డు ఉండడంతో రోడ్డు విస్తరణకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. దయ్యాలగండి రోడ్డులో 15 సంవత్సరాల్లో ఇప్పటి వరకు 32రోడ్డు ప్రమాదాలు జరిగి 10మంది మృత్యువాత పడ్డారు. 24 మంది క్షతగాత్రులయ్యారు.


సాగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో మొదటి ఘాట్ వద్ద దయ్యాలగండి ప్రాంతం వద్ద కంపచెట్లతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

గాలిలో నిండు ప్రాణాలు..

దయ్యాలగండి వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ ప్రమాదాలకు ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణకు అనుమతి ఇవ్వని అటవీశాఖ వారా? పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారుల అని ప్రశ్నిస్తున్నారు. ప్రతి నెలా రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగున్నాయి. ప్రాణాలు కోల్పోవడంతో పాటు మరెందరో క్షతగాత్రులవుతున్నారు. శనివారం జరిగిన ప్రమాదంలో మృతిచెందిన బాబుకు ఐదు సంవత్సరాలలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు. గాయపడిన అతని భార్య అనిత, బావమరిది నరేష్ పరిస్థితి కూడా విషమంగా ఉంది. అటవీ శాఖ అధికారులు రోడ్డు విస్తరణకు అనుమతులు ఇచ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు కూడా చొరవ తసుకొని రోడ్డును విస్తరించాలని పలువురు వాహనదారులు, పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నాగార్జునసాగర్ దయ్యాలగండి ప్రాంతం వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతన్నాయి. ఇందుకు కారణం మూలమలుపులు ఉండడంతో పాటు ఘాట్ రోడ్డు కావడంతో సాగర్ వైపు నుంచి వాహనాలు వేగంగా కిందికి వెళ్తుంటాయి. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడిరోడ్డు విస్తరించి మలుపులు లేకుండా చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

● సంపత్, నాగార్జునసాగర్ ఎస్ఐ.

దేశమంతా హుజూర్‌నగర్ వైపు చూస్తోంది

● ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకం ప్రారంభం ● పేదల ఆకలి తీర్చేందుకు కృషి: సీఎస్ శాంతికుమారి ● హుజూర్‌నగర్‌పై వరాలు కురిపించిన సీఎం

(5వపేజీ తరువాయి)

లను తాము మర్చిపోలేదని, ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరిగినా సహించేదిలేదని, ప్రతీకారం తప్ప దని హెచ్చరించారు. హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాల, కోదాడలో జవహర్‌నవోదయ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎంను కోరుతున్నట్లు ప్రకటించారు. తాను, పద్మావతి రెండు నియోజకవర్గాల ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంతో మాట్లాడారు. తనను ఏడు సార్లు గెలిపించారని, తాను ఏ పిలుపునిచ్చినా విజయవంతం చేశారని పేర్కొన్నారు. తమకు వేరే కుటుంబం లేదని, రెండు నియోజక వర్గాల ప్రజలే తమ కుటుంబాలని పేర్కొన్నారు. ఒక చారిత్రాత్మకమైన ఈ సభకు సీఎం వచ్చినందుకు ధన్య వాదాలని పేర్కొన్నారు.



సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభం సందర్భంగా అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, బాలు నాయక్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు

మోడల్ కాలనీ అద్భుతం

హుజూర్‌నగర్‌లోని హౌసింగ్ మోడల్ కాలనీ అద్భుతమని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఫణిగిరి గట్టు వద్ద నిర్మాణంలో ఉన్న 2,160 జీప్లస్-1 మోడల్ కాలనీ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తదితరులతో కలిసి పరిశీలించి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మోడల్ కాలనీని అద్భుతంగా నిర్మాణం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్‌ను ప్రశంసించారు. పదేళ్ల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మోడల్ కాలనీ ప్రారంభించడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మోడల్ కాలనీ ప్రాజెక్ట్ వివరాలను సీఎంకు హౌసింగ్ ఎండీ గౌతమ్ వివరించారు. సుమారు 20 నిమిషాల పాటు మోడల్ కాలనీని పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోడల్ కాలనీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.



మోడల్ కాలనీని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పేదలకు నాణ్యమైన సన్నబియ్యం

● సీఎస్ శాంతికుమారి



పేదలకు ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం పంపిణీచేస్తోందని సీఎస్ శాంతికుమారి పేర్కొన్నారు. సీఎం సభలో తొలుత ఆమె ప్రసంగిస్తూ, దొడ్డు బియ్యానికి బదులు సన్నబియ్యం పంపిణీచేసి పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 92.40లక్షల రేషన్‌కార్డులు ఉండగా, 2.40కోట్ల లబ్ధిదారులు ఉన్నారన్నారు. కొత్తగా 10లక్షల కార్డులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వం 24లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కొనుగోలు చేసిందన్నారు. రైతుల నుంచి సన్నధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం రూ.1,200కోట్లు బోనస్‌గా చెల్లించిందన్నారు. రాష్ట్రంలో 3.10కోట్ల మందికి పైగా సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీచేస్తామన్నారు. సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వంపై రూ.2,858కోట్ల అదనపు భారం పడుతోందన్నారు.

సభలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు

సీఎం సభలో సీఎస్ శాంతకుమారితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, బాలూనాయక్, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, అనిల్‌కుమార్, ఆలీఖాన్, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, బలరామ్‌నాయక్, అనిల్‌యాదవ్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్, ప్రెస్ అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్, గుత్తా అమిత్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహులు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభం సందర్భంగా అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, బాలు నాయక్, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి బలరాం నాయక్ తదితరులు

మంత్రి ఉత్తమ్‌పై ప్రశంసలు

హుజూర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిపై సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసలు కురిపించారు. కార్యకర్తల కృషి ఫలితంగా ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా ఉత్తమ్ ఉన్నారన్నారు. కార్యకర్తల కష్టనష్టాల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులు ఉండడం వల్లే ఎమ్మెల్యేలుగా, ఎంపీగా గెలిచారన్నారు. 'మీ ఊరి కోడలు.. మావూరి ఆడబిడ్డ' అయిన పద్మావతిరెడ్డి ప్రజాసేవలో ఉన్నారన్నారు. ఉత్తమ్, పద్మావతి ఇద్దరూ పార్టీ కార్యకర్తలే కుటుంబంగా భావించడం గర్వకారణమన్నారు. నల్లగొండ పార్లమెంట్ చరిత్రను తిరగరాసిన సంఘటనలో వారిద్దరి పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎంపీగా ఉన్న ఉత్తమ్ అదే నియోజకవర్గం నుంచి రఘువీర్‌రెడ్డిని 5.60లక్షల మెజార్టీతో గెలిపించడం విశేషమన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా వెంటనే చేస్తారని అన్నారు. ఫణిగిరి గట్టు వద్ద మోడల్ కాలనీకి రూ.74.80కోట్లు మంజూరు చేయించుకున్నారన్నారు.

గిరిజనుల తలపాగా ధరించిన సీఎం



హుజూర్‌నగర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి గిరిజనుల తలపాగా ధరించారు. గిరిజన మహిళలు సీఎంతో పాటు మంత్రి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకి గిరిజనులు తలపాగా పెట్టి వారితో ఫొటో దిగారు. అదేవిధంగా గిరిజన నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డికి నాగలి బహూకరించారు.

లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ

రేషన్‌కార్డు దారులకు సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ చేశారు. హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసి వారితో గ్రూప్ ఫొటో దిగారు. పట్టణంలోని రేషన్‌కార్డుదారులు ధరావత్ బుజ్జీ, కర్ల రాధ, పైలా రజిత, చిరుమామిళ్ల సుశీల, షేక్ కరీమా, రాయంచు మమత, చల్లా సుగుణ, కర్నా వెంకటపుష్పకు సీఎం రేషన్ బియ్యం పంపిణీ చేశారు. అనంతరం సమభావన సంఘాల మహిళలకు రూ.26.16కోట్ల విలువైన చెక్కును అందజేశారు.

హుజూర్‌నగర్‌కు సీఎం వరాల జల్లు

సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు వరాల జల్లు కురిపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరిక మేరకు నియోజకవర్గానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా కోదాడ నియోజకవర్గానికి ఏటీసీ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్) మంజూరుచేస్తున్నామన్నారు. మిర్యాలగూడకు ఎమ్మెల్యే బీఎల్ఆర్, దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ కోరిక మేరకు రూ.200కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరుచేస్తున్నట్టు ప్రకటించారు. మంత్రి ఉత్తమ్ కోరిన తర్వాత తాను మంజూరుచేయకుండా ఉంటానా అని సీఎం నవ్వుతూ అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్న ఏది అడిగినా మంజూరు చేస్తానన్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాకు మంజూరైన జవహర్‌నవోదయ స్కూల్‌ని కోదాడలో ఏర్పాటు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంని కోరారు.

తెలంగాణ గీతాలాపన

సభ ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాన్ని ఆలపించగా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, శాసనమండలి స్పీకర్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, తదితరులు నిలొచ్చిన తెలంగాణ గీతాన్ని ఆలపించారు.

'నేనెరిగిన నిజం'

● నాలుగు మంచి మాటలు చెప్పాలనే సంకల్పం
● 'నేనెరిగిన నిజం' పేరిట మంచి మాటల సంకలనం
● సామాజిక స్పృహతో 'సేవ'కు శ్రీకారం



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరచారి

నార్కట్‌పల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తన వాట్సాప్ స్టేటస్ వేదికగా ఎందరికో 'మంచి మాట'లు చేరేలా సామాజిక స్పృహను కనబరుస్తున్నారు ఈ 'మంచి మాట కారి'. తన పుట్టిన రోజైన 2024, మార్చి 10న మొదలుపెట్టిన 'మంచి మాట' 2025, మార్చి 10నాటికి 365 రోజులు పూర్తికాగా రాసిన 'మంచి మాట'ల సంకలనాన్ని 'నేనెరిగిన నిజం' పేరిట అక్షర బద్ధం చేసి పుస్తక రూపంలో తెస్తున్నారు ముటుకుల్లోజు వెంకటేశ్వరాచారి (ఎం.వీ.చారి).

ఆర్టీసీలో ఉద్యోగం

నల్లగొండ నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ముటుకుల్లోజు వెంకటేశ్వచారిది స్వస్థలం చౌటుప్పల్ మండలం తంగడపల్లి. స్వర్ణకార కుటుంబానికి చెందిన ఎంవీచారి 1987లో ఆర్టీసీలో కండక్టర్‌గా చేరి నల్లగొండ రీజియన్ పరిధిలోని ఆయా డిపోల్లో పనిచేశారు. చివరకు నల్లగొండ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ ట్రాఫిక్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొంది నార్కట్‌పల్లి డిపోకు వచ్చారు. ఐతే ఆర్టీసీలో తన ఉద్యోగ జీవితానుభవంలో తోటి ఉద్యోగులకు డ్యూటీల విషయంలో మంచి మాటలు చెప్పే అలవాటు క్రమంగా సోషల్ మీ డియాకు మారి వాట్సాప్ స్టేటస్‌కు మారింది. మంచి మాటను వాట్సాప్ స్టేటస్ ద్వారా చెప్పాలనుకున్నాడు. 365 రోజులు క్రమం తప్పకుండా 'మంచి మాట'ను చెప్పారు. కాగా ఈ నెల 31న ఉద్యోగ విరమణ అనంతరం 'మంచి మాట'ను కాస్తా 'మన జీవనం'గా మారుస్తూ వైవిధ్యంగా కొనసాగించాలని భావిస్తున్నాడు.

ప్రశంసాపత్రాల రూపశిల్పి

ప్రముఖుల మొదటి అక్షర క్రమంలో సన్మాన పత్రాలను సాధారణ భాషలో రాసి ప్రశంసలు అందుకున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశంలాంటి ప్రముఖ రాజకీయ నాయకులు, ఆర్టీసీలో ఉన్నతోద్యోగులు, సమాజాభివృద్ధికి పాటుపడే ఎందరో వ్యక్తుల పేర్లలోని మొదటి అక్షరాలను ప్రాసగా చేసుకుని ఇప్పటికే సుమారు రూ.3లక్షల సొంత ఖర్చుతో 300కి పైగా సన్మానపత్రాలను ఉచితంగా రాసి బహూకరించారు. కాగా ఎంవీ చారి సాహితీ తపనను గుర్తించిన కామన్ డయాస్ అనే స్వచ్ఛంద సంస్థ 'ప్రశంసా పత్రాల రూపశిల్పి' అనే అవార్డుతో సత్కరించింది.

సొంతూళ్లో సేవ

నాణేనికి రెండో వైపు అన్నట్లుగా తన సొంతూరు తంగడపల్లిలో స్వయంగా 'సేవ' నే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. ఈ సంస్థ ద్వారా గ్రామంలో దసరా ఉత్సవాలు, ఎవరైనా పేదవారు చనిపోతే వారికి చేతనైన సాయం చేయడం, ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం చేస్తున్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీకి సన్నాహాలు



(5వపేజీ తరువాయి)

నుంచి ప్రభుత్వం నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాలో మొత్తం 14రకాల పరికరాలు ఉన్నాయి. రోటర్‌వేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, కిసాన్ డ్రోన్‌లతో పాటు ఇతర యంత్రాలు ఈ జాబితాలో ఉన్నాయి.

మొదటి విడత 1,552మంది రైతులకు

రాష్ట్ర ప్రభుత్వం తొలివిడత ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,552మంది రైతులకు ఈ పథకం కింద పరికరాలు అందజేయనుంది. నల్లగొండ జిల్లాలో 820మంది రైతులకు పరి కరాల ఇచ్చేందుకు రూ.1,81,36,000 కేటాయించింది. సూర్యాపేట జిల్లాలో 457మంది రైతులకు రూ.1,06,01,000 కేటాయించగా, యాదాద్రి జిల్లాలో 275మంది రైతులకు రూ.72,05,000 మొత్తంగా ఉమ్మడి జిల్లాకు రూ.3,59,86,000 కేటాయించింది. అయితే ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడటంతో దరఖాస్తుల గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించారు. తొలుత ఈ నెలలోపే అవగాహన సదస్సు నల్లగొండలో ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లా రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. అయితే సమయం లేకపోవడంతో వాయిదా వేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన ఆరోపణలు, విమర్శలకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేసేందుకు ఈ నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన రైతులందరికీ వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించిన పనిముట్లను రాయితీపై ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో కేంద్ర భాగస్వామ్యం కూడా ఉంది. మొత్తం 50శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేయనున్నారు. మిగతా 50శాతాన్ని రైతులు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది.

వచ్చే నెలలో యాంత్రీకరణ పరికరాలు

వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన ప్రతీ రైతుకు పరికరాలు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దరఖాస్తుల ప్రక్రియ ముగియగానే లబ్ధిదారుల ఎంపిక చేపట్టి వచ్చే నెలలో పరికరాలు అందజేస్తాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే ఏప్రిల్ నెలలో పరికరాలను రైతులకు అందజేస్తాం. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

పి.శ్రవణ్ కుమార్, నల్లగొండ జేడీఏ

గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు

● సత్తా చాటిన ఉమ్మడి జిల్లావాసులు ● బంధువులు, గ్రామస్థుల అభినందనలు

నల్లగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన గ్రూప్ - 1 ర్యాంకింగ్‌లో నల్లగొండకు చెందిన దాది వెంకటరమణ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. వెంకటరమణ ఐదేళ్లుగా సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటరమణ ఈ ఏడాది ప్రకటించిన జేఎల్, డీఏవో, గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాల్లో ప్రతిభ చూపాడు. ప్రస్తుతం జహీరాబాద్‌లో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వరిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రాసి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు (535.5 మార్కులు) సాధించాడు. ఆయన తల్లిదండ్రులు దాది శ్రీనివాసరావు విద్యాశాఖలో ఉద్యోగి కాగా, తల్లి రాచమల్ల రమాదేవి అనుముల మండల అలీనగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులిగా పనిచేస్తున్నారు.




రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించిన వెంకటరమణ

మొదటినుంచి కలెక్టర్ కావాలనేది నా కల: వెంకటరమణ

మొదటినుంచి కలెక్టర్ కావాలనేది నా కల. గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడంతో డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ రానుంది. నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఐదేళ్లుగా ఎంతో కష్టపడుతున్నాను. అమ్మానాన్నల ప్రోత్సాహం, కృషితోనే ఈ స్థాయికి చేరుకున్నాను.

ఆరో ర్యాంకు సాధించిన హర్షవర్ధన్

మిర్యాలగూడ టౌన్: ప్రతిష్ఠాత్మక గ్రూప్-1 ఫలితాలలో పట్టణ యువకుడు సత్తా సాటాడు. టీజీపీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను విడుదల చేయగా పట్టణానికి చెందిన పూనాటి హర్షవర్ధన్ (హాల్ టికెట్ నెం. 240911138) ఆరో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. మార్చి 10న గ్రూప్ 1 ప్రొవిజనల్ మార్కులు విడుదల చేయగా 525.5 మార్కులు సాధించాడు హర్ష. పరీక్ష రాసిన అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను విడుదల చేయగా 525.5 మార్కులు సాధించిన హర్షవర్ధన్ ఆరో ర్యాంకుతో టాప్‌టెన్‌లో జాబితాలో చోటు దక్కించుకున్నాడు.



హర్షవర్ధన్

● కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో..

పట్టణంలోని సరస్వతినగర్‌కు చెందిన పూనాటి తిరుపతిరావు-రాజ్యలక్ష్మీ దంపతుల కుమారుడైన హర్షవర్ధన్ పదో తరగతిలో 568 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 972 మార్కులు సాధించి ఔరా అనిపించుకున్నాడు. తదనంతరం హైద్రాబాద్‌లోని బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్(కంప్యూటర్ సైన్స్) విద్యను పూర్తి చేసిన హర్ష అమెజాన్‌లో ఆకర్షణీయమైన ప్యాకేజీతో కొలువుదీరాడు. కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో యూపీఎస్సీ(ఐఏఎస్)కి ప్రిపేరైన హర్ష గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన పరీక్షకు హాజరయ్యాడు. అయితే పేపర్ లీకేజీ వ్యవహారంతో పరీక్ష రద్దయింది. దీంతో టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రాసిన హర్షవర్ధన్ 525.5 మార్కులతో ఆరో ర్యాంకు సాధించి సత్తాచాటాడు.

ఆనందంగా ఉంది : హర్షవర్ధన్

కష్టపడి చదివితే మంచి ఫలితం తప్పకుండా వస్తుందని హర్షవర్ధన్ అన్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో ఆరో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో పరీక్షకు ప్రిపేర య్యానన్నారు. ఈ ర్యాంకుతో కన్ఫర్మ్‌డ్ ఐఏఎస్ ఖచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అమ్మమ్మ జంపాల లక్ష్మమాంబ, తాతయ్య కొండయ్యల ఆశీర్వాదాలతోనే ఈ ర్యాంకు సాధించానన్నారు. నా విజయాన్ని వారికే అంకితమిస్తున్నా అని చెప్పారు.

గ్రూప్-1కు మహేష్‌రెడ్డి ఎంపిక



మహేష్‌రెడ్డి

మోటకొండూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని నాంచారిపేట గ్రామానికి చెందిన పైళ్ల విఠల్‌రెడ్డి-రమాదేవి దంపతుల కుమారుడు మహేష్‌రెడ్డి గ్రూప్-1లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 497 మార్కులతో రాష్ట్రస్థాయి 60వ ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం సైబరాబాద్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరోలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో డిప్యూటీ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పోస్టు సొంతం చేసుకోనుండడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

రామన్నపేట: గ్రూప్-1 ఫలితాల్లో రామన్నపేటకు చెందిన సాల్వేరు సత్యనారాయణ కుమారుడు సాయిచరణ్ 61వ ర్యాంకు సాధించారు. సాయిచరణ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏసిక్‌లో సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఆరేళ్లుగా పనిచేస్తున్నారు. గత అక్టోబరులో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్ గెజిటెడ్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం గ్రూపు-1లో 61వ ర్యాంకు సాధించి రాష్ట్ర అత్యున్నతస్థాయి ఉద్యోగాన్ని సాధించారు. దీంతో మొత్తం 10 ప్రభుత్వ పోస్టులు సాధించిన ఘనత సాల్వేరు సాయిచరణ్ దక్కించుకున్నారు.



సాయి చరణ్

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్‌గా ప్రసాద్



నార్కట్‌పల్లి, మార్చి30, (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా దోసపాటి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే వీరేశంను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 6వ తేదీన జరిగే శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, అచ్చాలు, భరత్ పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన నోముల శ్రీనివాస్



శాలిగౌరారం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మార్కెట్ కాలనీకి చెందిన నోముల శ్రీనివాస్ ఆర్మీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఈవెంట్‌లో పాల్గొన్నాడు. సికింద్రాబాద్‌లోని ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో శ్రీనివాస్ ఆర్మీలో అగ్నివీర్ జనరల్ కేటగిరి ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

ప్రజలు సహకరించాలి

శ్రీనివాస్, ఎంఈవో, మర్రిగూడ



మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, గ్రామ పోలీస్ అధికారుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సైదులు అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

(శాలిగౌరారం,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: పోలీస్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బంది ఉన్నారా?

ఎస్ఐ: పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం సరిపడా పోలీస్ సిబ్బందితో పాటు హోంగార్డులు కూడా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో అన్ని గ్రామాలకు పోలీస్ అధికారులను నియమించారా?

ఎస్ఐ: మండలంలోని 24 గ్రామాలకు పోలీస్ అధికారులను నియమించాం. వారికి గ్రామస్థులు ఎలాంటిఫిర్యాదు అయినా ఇవ్వవచ్చు.

ఆంధ్రజ్యోతి: క్రైమ్ రేటు గతంలో కంటే తగ్గిందా? పెరిగిందా?

ఎస్ఐ: మండలంలో గతంలో కంటే క్రైమ్‌రేటు కంట్రోల్‌లో ఉంది.

ఆంధ్రజ్యోతి: ఏఏ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నా యి?

ఎస్ఐ: మండలంలో వల్లాల, మనిమద్దె, గురజాల, తుడిమిడి, అంబారిపేట, శాలిగౌరారంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగతా గ్రామాల్లో ఏర్పాటుకు స్వచ్ఛంధ సంస్థలు, దాతలు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: ప్రస్తుతం మండలం ఇసుక అక్రమ రవాణా జరగడం లేదు. మనిమద్దె, గురజాల, తుడిమిడి గ్రామాల్లో శ్యాండ్ టాక్స్ ద్వారా ఇసుకను ప్రభుత్వం నడిపిస్తుంది. వంగమర్తి ఇసుక రీచ్ జిల్లా మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. ఎవరైనా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో గంజాయి కదలికలు ఉన్నాయా?

ఎస్ఐ: మండలంలో గంజాయి కదలికలు ప్రస్తుతం ఏమి లేవు. గంజాయి ఎవరైనా విక్రయించినా, తాగినా సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమైనా ఉన్నాయా?

ఎస్ఐ: మైనర్లకు వాహనాలు ఇస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో తల్లీదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. ఒకవేళ ఇస్తే చెకింగ్ తల్లిదండ్రుల మీద కేసులు నమోదు చేస్తాం. ప్రస్తుతం వేసవి కాలమైనందున పిల్లలు ఈతకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఒంటరిగా పంపించవద్దు.

వసతులు మృగ్యం





నల్లగొండ పట్టణంలోని రెవెన్యూ కాలనీ ఆర్చీ, (ఇన్‌సెట్‌లో) కాలనీలో నీరు పడిన బోరు

- 15 ఏళ్లు గడిచినా పాతిక ఇళ్లు నిర్మాణం కాని పరిస్థితి
- ఏళ్ల తరబడి సమస్యలకు పరిష్కారం కరువు
- సొసైటీ కమిటీ తీరుపై సభ్యుల ఆవేదన
- రెవెన్యూ కాలనీలో ఏం జరుగుతోంది

నల్లగొండ/నల్లగొండటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని రెవెన్యూ ఉద్యోగుల కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. కాలనీకి ఏర్పాటు చేసిన కమిటీ 15 సంవత్సరాలుగా నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో కనీస వసతులు కూడా అందడం లేదని కాలనీలోని ప్లాట్ల యజమానులు, కమిటీ సభ్యులు వాపోతున్నారు. నల్లగొండ డివిజన్‌లో ఐదేళ్ల సర్వీస్ ఉన్న రెవెన్యూ ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకోవడానికి 2009లో అప్పటి ప్రభుత్వం రాంనగర్‌లో 18 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించింది. అందులో 283మంది ఉద్యోగులకు ప్లాట్లు ఇచ్చారు. అప్పట్లో కమిటీ వేసి ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 లక్షల చొప్పున రూ.5కోట్ల వరకు వసూలు చేసినట్లు పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఆ డబ్బుల్లో రూ.22లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించి నామినేషన్ పద్ధతిలో అరకొర అభివృద్ధి చేసి మమ అనిపించారనే విమర్శలు వస్తున్నాయి. 15 ఏళ్లు కమిటీలో మార్పులు చేయకపోవడంతో సమస్యలు వస్తున్నాయని తెలుస్తుంది. కాలనీలో చాలా కాలంగా తాగు నీటి సమస్యతో పాటు గృహ అవసరాలకు అవసరమైన నీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు ఉన్నా పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. వసతుల గురించి పట్టించుకోని కమిటీ ప్లాట్ల కేటాయింపుల్లో చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నల్లగొండ డివిజన్ వారికే ప్లాట్లు ఇవ్వాల్సి ఉండగా జిల్లాలో ఇతర డివిజన్ వాళ్లకు కూడా అక్రమ మార్గంలో రెండు ప్లాట్లు ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్లాట్ల పేరుతో వచ్చిన డబ్బులపై కనీసం ఆడిట్ కూడా చేయడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

బోర్లు వేసినా పడటం లేదు

కాలనీలో కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎలాంటి అవకతవకలు జరగడం లేదు. కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. భూగర్భజలాలు తగ్గడంతో బోర్లు వేసినా పడటం లేదు. ఇళ్లు కట్టుకున్న వాళ్లు సొంత బోర్లు వేసుకున్నారు. కృష్ణా జలాల లైన్ కూడా ఉంది. మునిసిపాలిటీ ద్వారా సరఫరా అవుతున్న నీటిని కొందరు మోటార్లతో తీసుకోవడం వల్లే తాగునీటి సమస్యలు తలెత్తున్నాయి. నల్లా అనుమతి తీసుకోవాలని కోరినా తీసుకోవడం లేదు. కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారికి మాత్రం నీళ్లు లేవు, ఒక్కరికే రెండు ప్లాట్లు ఇస్తే నిరూపించాలి.

● ఆంజనేయులు, రెవెన్యూ కాలనీ అధ్యక్షుడు

15 ఏళ్లు గడిచినా పాతిక ఇళ్లు లేని వైనం

ఇళ్ల స్థలాలు కేటాయించి 15 ఏళ్లు దాటుతోంది. అయినా ఇప్పటి వరకు 25 ఇళ్లు కూడా నిర్మాణం కాలేదంటే నిర్లక్ష్యం ఆ సొసైటీదేనని స్పష్టం అవుతుంది. కాలనీలో కృష్ణా జలాలకు సంబంధించి రెండు ఇంచుల పైపులైన్ మాత్రమే ఏర్పాటు చేయడంతో నీళ్లు సరిపడా రావడంలేదని సమాచారం. ఓవర్‌హెడ్ ట్యాంకు తీర్మానం చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కాలనీవాసుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో కొత్త నిర్మాణాలు జరగడం లేదు. కొత్తగా నిర్మాణాలు చేపట్టడానికి నీళ్లు కూడా లేకపోవడంతో నిర్మాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో బోరు ఉన్నా పార్కు ఉన్న తోట ఉండటంతో ఆ చెట్లకు నీళ్లు పెడుతుండటంతో గృహ అవసరాలకు కూడా నీరు సరిపోవడం లేదు. కాలనీలో చెట్లను కాపాడాల్సిన బాధ్యత సొసైటీకి ఎంత ఉందో కాలనీలో నివాసముంటున్న ఉద్యోగుల కుటుంబాలకు కూడా నీటిని ఇవ్వాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.



శిథిలమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, మామిడి కొమ్మలు, వేప మండలను పెట్టి విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. షడ్రుచులతో తయారుచేసిన ఉగాది పచ్చడిని ఇంటిల్లిపాది సేవించడంతో పాటు ఇరుగు పొరుగుకు పంచిపెట్టారు. కొత్త సంవత్సరం నుంచి శుభాలు కలగాలని పూజలు చేశారు. ఆలయాల్లో సాయంత్రం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు.

● మర్రిగూడలో ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో, మర్రిగూడ చౌరస్తాలో చెరుకు శ్రీరాములుగౌడ్, కోడాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

● కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను సంప్రదాయరీతిలో ఘనంగా నిర్వహించారు. కేతేపల్లి, ఇనుపాముల, భీమారం గ్రామాల్లో పూజారులు కాటేపల్లి శ్రీనివాసశాస్త్రి, వేణుశర్మ రాశి ఫలాలను గ్రామస్థులకు చదివి వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో ఇనుపాముల శివాలయ చైర్మన్ తిరుగుడు జితేందర్, కేతేపల్లి శివాలయ ప్రతినిధులు ఎస్.జేజయ్య, డి.ఎర్రయ్య, వీరాచారి, ఎం.పున్నయ్య, దేవలింగం, వెంకన్న, నాయకులు గంగయ్య పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలకేంద్రంలోని శ్రీసాయి మణికంఠ దేవాలయంలో పూజారి కొటారు సత్యనారాయణశర్మ, శివాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ పూజారి పెండ్యాల శివప్రసాద్ పంచాగం చదివి వినిపించారు.

● శాలిగౌరారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడి పంటలు పండుతాయని పురోహితులు రామడుగు వెంకట్రామశర్మ తెలిపారు. శాలిగౌరారం గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతకర్త శేషభట్టర్ లక్ష్మణమూర్తి రాసిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, ప్రోగ్రాం చైర్మన్ నిమ్మల వీరస్వామి, లయన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు, గోపాలాయిపల్లి, శాపల్లి, నార్కట్‌పల్లి పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో పంచాంగశ్రవణం చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చిట్యాల మండలం నేరడ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణానికి హాజరైన భక్తులు

● చిట్యాలలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం, ప్రమోదసాహితీ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి కుకుడాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందని జిట్టగోని సైదులు ఉగాది పచ్చడి, వివిధ రకాల పిండి వంటలు చేయించి ప్రజలకు పంపిణీ చేశాడు.

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఉగాదిని పురస్కరించకుని భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అర్చకస్వాములు భక్తులకు పంచాంగ శ్రవణం వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య, ఉపేందర్‌రెడ్డి అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌కుమారాచార్యులు, దామోదర్, మహేష్, శ్రీను ఆలయ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుపై బకాయి వడ్డీ రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ అవకాశం సోమవారం వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు విషయాన్ని గమనించి అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని సహకరించాలని ఆయన కోరారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు

పెద్దఅడిశర్లపల్లి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నల్లగొండ సూర్య హాస్పటల్ అధినేత డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు, పీఏపల్లి మండలకేంద్రంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని సూర్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది పచ్చడి, చల్లటి నీళ్లను పంపిణీ చేశారు. ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవికాలం పూర్తయ్యే వరకు చలివేంద్రంలో ప్రతీరోజు స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటీ సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు తేరా సత్యనారాయణరెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోర్ల సైదమ్మశ్రీనివాస్, పాండునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో గడపాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



పంచాంగ శ్రవణం కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండకల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ మంచి జరిగి, సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆదివారం బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విశ్వావసు నామసంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పండుతులు మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. నూతన సంవత్సరంలో రాశి ఫలాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్ర ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, 2014 నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని, సీఎం చంద్రశేఖర్‌రావు కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. అనంతరం కవులు, కళాకారలను ఉగాది పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు కటికం సత్తయ్య గౌడ్, చీర పంకజ్ యాదవ్, బొర్ర సుధాకర్, వెంకటేశ్వర్లు, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బక్క పిచ్చయ్య, సత్యనారాయణ, శర్మ, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంభవీదేవి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిట్యాలరూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా చిట్యాల మండలం నేరడలోని శాంభవీదేవి ఆలయంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారిని భక్తులు పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉగాది సందర్భంగా అమ్మవారికి వేపకొమ్మలను అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

నల్లగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో పలువురు ముస్లిం కుటుంబ సభ్యులకు తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లారీ ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని కందుల వెంకటరమణగౌడ్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది తమ వద్ద పనిచేసే ముస్లిం మైనార్టీ సోదరులందులకు ఆనవాయితీగా తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మైనార్టీ కుటుంబ సభ్యులతో పాటు ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : ఎస్ఐ

కట్టంగూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని కట్టంగూరు ఎస్ఐ ఎం.రవీందర్ అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించినట్లు ఆయన తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు వాహనాదారులకు డ్రంక్ డ్రైవ్ కేసులు వేస్తున్నాం. ప్రమాదకరమైన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశాం. మండలంలో 19 కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్న 65వ జాతీయ రహదారిపై నాలుగు బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. ముత్యాలమ్మగూడెం పరిధిలోని మాణిక్యాలమ్మగూడెం జంక్షన్, కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు, అయిటిపాముల సమీపంలో చెర్వుఅన్నారం క్రాస్‌రోడ్డు, పామనగుండ్ల జంక్షన్ వద్ద బ్లాక్ స్పాట్‌లను గుర్తించినట్లు పేర్కొన్నారు. అంతేకాక ప్రమాదా నివారణకు లారీ, డీసీఎం, ఆటో, ద్విచక్ర వాహనదారులతో పాటు స్థానిక ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఈ ఏడాదిలో సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి ఇప్పటి వరకు మూడు నెలల్లో జనవరిలో 48, ఫిబ్రవరిలో 39, మార్చి 69 కేసులు మొత్తం 156 డ్రండెన్ డ్రైవ్ కేసులను నమోదు చేశాం. జంక్షన్ల వద్ద ప్రమాదాలను నివారించేందుకు జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు జీబ్రా లైన్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

పీడిత ప్రజల పక్షాన నిలిచిన మహాకవి దాశరథి

● మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నల్లగొండలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న నర్సిరెడ్డి

నల్లగొండ కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎందరో కవులు ఉన్నా, పీడిత ప్రజల పక్షాన నిలిచిన కవి దాశరథి మాత్రమేనని, ఆయన జయంతి సందర్భంగా కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు అందజేయడం గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచాలని అన్నారు. వివిధ రంగాల్లో కృషి చేసిన 9 మందికి ఉగాది విశిష్ట పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. పలువురు కవులు పాల్గొని కవితా గానం చేశారు. కార్యక్రమంలో సాహితీ మేఖల ప్రధానకార్యదర్శి పున్న అంజయ్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, ఎం. పురుషోత్తమాచార్యుల, వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, చిన బిక్షమయ్య, పెందోట సోము, ఉగాది పురస్కార గ్రహీతలు మ్యూజిక్ డైరెక్టర్ చరుణ్ అర్జున్, సింగర్ కాసాల నర్సిరెడ్డి, శ్రీరంగాచార్య, రుద్రసాయి బాబు, శివ సుబ్రహ్మణ్యం, నరసింహరాజు, కాంతారావు, ఎల్వీకుమార్, సత్యనారాయణచార్యులు, కవులు మూనాస వెంకట్, చొల్లేటి ప్రభాకర్, బుచ్చిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలగిరి కవులు చరిత్ర -2వ భాగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేవులపల్లి నాగరాజుశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది.

ప్రకృతి పానీయాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రకృతిలోని పానీయాలను సేవించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఉగాది సర్వదినాన్ని పురస్కరించుకుని టీఎస్‌యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రకృతి పానీయాలైన నిమ్మరసం, మజ్జిగ, రాగి జావ, బత్తాయి రసం, కొబ్బరినీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర, జిల్లా నాయకులు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎడ్ల సైదులు, రాజశేఖర్‌రెడ్డి,నాయకులు పెరుమాళ్ల వెంకటేశం, పోలె వెంకటయ్య, నరసింహ, వెంకన్న,రవీందర్, సైదులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకుల అరెస్ట్ చట్టవిరుద్ధం



చిట్యాల: స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు

చిట్యాల, కేతేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్ పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆదివారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. అరెస్ట్ అయినవారిలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, నాయకులు పొన్నం లక్ష్మయ్య, జిట్ట నగేష్, కోనేటి ఎల్లయ్య, ఆగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి: సూర్యాపేట జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో కేతేపల్లి పోలీసులు సీఐటీయూ, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. హుజూర్‌నగర్‌లో జరిగే సీఎం సభకు వెళ్లి సమస్యలపై ఆందోళనకు దిగుతారనే సమాచారంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ల సుధీర్, గ్రామ పంచాయితీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జి.ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక కౌంటర్లు

- ఆస్తిపన్ను రాయితీ చెల్లింపులకు నేడే చివరి గడువు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

రామగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆస్తి పన్నుల వడ్డీ బకాయిలపై 90శాతం రాయితీ సౌకర్యం నేటితో ముగియనుంది. ఇటీవల కాలంలో ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీలు చెల్లిస్తే 90 శాతం రాయితీ సౌకర్యాన్ని కల్పిస్తుంచనున్నట్లుగా ప్రకటించిన విషయం తెలిసిందే. లక్ష్యాన్ని ఛేదించే దిశగా మునిసిపల్ అధికారులు వసూళ్ల కోసమే 14 బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికి పంపిస్తున్నారు. అయితే ఉగాది, రంజాన్ పర్వదినాలు సెలవులు అయినప్పటికీ అధికారులు, సిబ్బంది సెలవులు తీసుకోకుండా లక్ష్యాన్ని చేరుకోవాలనే ఉద్దేశ్యంతో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు కార్యాలయంలో ప్రత్యేకంగా రెండు కౌంటర్లు కూడా ఏర్పాటు చేశారు.

కలిసి వస్తున్న వడ్డీ మాఫీ సౌకర్యం

ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ సౌకర్యం మునిసిపల్ అధికారులకు కలిసివస్తోంది. బకాయిలు పెద్ద ఎత్తున ఉండటంతో వీటిని ఎలా వసూళ్లు చేయాలని అధికారులు తలలు పట్టుకున్న నేపథ్యంలో ప్రభుత్వం వడ్డీ మాఫీ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. దీంతో వడ్డీ మాఫీ అయితుందన్న ఉద్దేశ్యంతో పట్టణ ప్రజలు పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. ఈ అవకాశం మునిసిపల్ అధికారులకు కలిసి వస్తుందని చెప్పవచ్చు.

పండుగ రోజుల్లో కౌంటర్లు ఓపెన్

ఆస్తిపన్నును వసూళ్లు చేసేందుకు ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో సైతం మునిసిపల్ కార్యాలయంలో రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలకు ఏ మాత్రం అసౌకర్యాలు కలుగకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.

70 శాతం పైగా వసూళ్లు

పట్టణంలో 48 వార్డులకుగాను 42 వేల పైచిలుకు గృహ నిర్మాణాలు ఉన్నాయి. అయితే వీటి నుంచి ప్రతి ఏటా ఆస్తి పన్ను రుపేనా రూ.16.75 కోట్లు రానుంది. మునిసిపల్ అధికారులు, సిబ్బంది చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌తో నేటి వరకు రూ.14 కోట్లకు పైగా వసూలయ్యాయి. ఇక మిగిలిన బకాయిలను కూడా వసూలు చేసేందుకు సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూనే ఉన్నారు.

ఈ అవకాశం మళ్లీ రాకపోవచ్చు



ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ అవకాశం మళ్లీ రాకపోవచ్చు. ఈ అవకాశానికి సోమవారం చివరి రోజు అయినందున బకాయిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలి. వసూళ్లే లక్ష్యంగా సిబ్బందిని ఇంటికి ఇంటికి పంపడంతో పాటు కార్యాలయంలో కూడా రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం.

● సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	230
సూర్యాపేట	రూ.140	200	230
నల్లగొండ	రూ.140	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 కనిష్ఠం 23.0


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న స్పీకర్లు గడ్డం ప్రసాద్‌కుమార్
గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

సన్నబియ్యం పథకంతో చరిత్రలో హుజూర్‌నగర్

- సీఎం రేవంత్‌రెడ్డి
- దేశమంతా హుజూర్‌నగర్ వైపు చూసేలా సభ : మంత్రి ఉత్తమ్

నల్లగొండ/సూర్యాపేట/కోదాడ/హుజూర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశంలో ఎక్కడా లేని రీతిలో ఉగాది రోజున పేదలకు సేవచేయాలనే సత్సంకల్పంతో హుజూర్‌నగర్ గడ్డ నుంచి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించాం.. ఈ ఘట్టానికి వేదికైన హుజూర్‌నగర్ చరిత్రలో నిలిచిపోతుంది.. రోటీ, కపడా, మకాన్ పథకాలు, బలహీనవర్గాలకు భూపంపిణీ చేయడం ద్వారా ఇందిరమ్మ, పేదలకు తెల్లన్నం అందించిన విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎన్టీఆర్, దేశంలో పేదలందరికీ ఆహారభద్రత ఉండాలనే లక్ష్యంతో సోనియాగాంధీ రూపొందించిన ఆహారభద్రత పథకం ఎలాగైతే చరిత్రలో నిలిచిందో... ఈ రోజు తెలంగాణ ప్రభుత్వం నుంచి తాము ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం అలాగే చరిత్రలో నిలిచిపోతుంది.. ఈ పథకాన్ని ప్రారంభించిన హుజూర్‌నగర్ గడ్డ చరిత్రలో నిలుస్తుంది' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్లగొండ ఉమ్మడి జిల్లా చైతన్యవంతమైన ప్రాంతమని, నిజాములను, రజాకార్లను ఎదిరించి పోరాడిన చాకలి ఐలమ్మ, దొడ్డికొమరయ్య, ధర్మభిక్షం, బీఎన్‌రెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి యోధులున్న గడ్డని కొనియాడారు. నాడు తొలి లోకసభలో నల్లగొండ నుంచి ప్రాతినిధ్యం వహించిన రావి నారాయణరెడ్డికి దేశంలోనే నెహ్రూకంటే కూడా అత్యధిక మెజార్టీ ఇచ్చారని, ఆ తర్వాత మళ్లీ మొన్నటి ఎన్నికల్లో ఇక్కడి ఎంపీ రఘువీర్‌కు దక్షిణ భారతదేశంలోనే అత్యధిక మెజార్టీ అందించారని, అందులో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి లక్ష చొప్పున మెజార్టీలు సాధిస్తామని చెప్పి ఉత్తమ్, పద్మావతి దంపతులు చేసి చూపించారని కొనియాడారు. ఈ రోజు సభకు వచ్చిన జనాన్ని, ఆడబిడ్డలను చూస్తుంటే ఉత్తమ్, పద్మావతి ఇక్కడి ప్రజలను కుటుంబంగా భావించిన తీరు అర్థమవుతోందని ప్రశంసించారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ హయాంలోనే నాగార్జునసాగర్ కట్టించారని, శ్రీశైలం ప్రాజెక్టు కట్టింది కాంగ్రెస్సేనని, ఈ జిల్లాకు ఉద్దేశించిన ఎస్ఎల్‌బీసీ, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాలే కట్టాయన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టును నాడు వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు జిల్లా నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొట్లాడి తెచ్చారని, 43కిలోమీటర్ల సొరంగానికి 34కిలోమీటర్లు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తవ్వితే, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీకి ఈ జిల్లా ప్రాజెక్టులు, నీళ్లు అవసరం లేదని, ఇక్కడి ఓట్లు, సీట్లు మాత్రం కావాలని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి పండేది ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే అని, ఇక్కడ 12లక్షల ఎకరాల్లో వరి సాగవుతోందని, అత్యధికంగా రుణమాఫీ, సన్న ధాన్యానికి ఇచ్చే బోనస్ కూడా ఈ జిల్లాకే ఎక్కువగా వచ్చాయన్నారు.

80శాతం మంది ప్రజలకు ఉచిత బియ్యం : మంత్రి ఉత్తమ్

దేశ స్వాతంత్ర్య చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా 80శాతం ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇచ్చే పథకం అమలు చేయలేదని, మొదటిసారి రాష్ట్రంలో తాము అమలు చేస్తున్నామని, దేశమంతా హుజూర్‌నగర్ వైపు చూసేలా ఈ పథకాన్ని ఇక్కడ ప్రారంభించామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ కింద దొడ్డురకం బియ్యం ఇస్తుంటే, అది దుర్వినియోగమవుతున్న విషయాన్ని తాము గుర్తించి, సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చించామని, వారి మార్గదర్శకాలతో ఈ రోజు నుంచి రాష్ట్రంలో రేషన్ కింద సన్నబియ్యం ఇచ్చే కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఈ సభకు హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి మహిళలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారని పేర్కొన్నారు. కమర్షియల్ పాలిటిక్స్ కొనసాగుతున్న ఈ రోజుల్లో తనపై గౌరవంతో, ప్రేమతో వచ్చిన హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో కార్యకర్తలను ఏవిధంగా హింసించారో, పోలీస్ కేసులు ఎలా పెట్టి వేధించారో అందుకు మిత్తి సహా చెల్లిస్తామని హెచ్చరించారు. తమ్మారం, పీక్యాతండా ఘటన...

- మిగతా 7వ పేజీలో...

సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

సీఎం పర్యటన సాగిందిలా...

- 5.45గంటలకు హెలీప్యాడ్‌లో దిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- 6.05 : మోడల్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పరిశీలన
- 6.12: మోడల్‌కాలనీ నుంచి సభావేదిక వద్దకు బయల్దేరిన సీఎం కాన్వాయ్
- 6.20: సభాప్రాంగణానికి చేరుకున్న సీఎం
- 6.22: సభావేదికపై సీఎంకు స్వాగతం పలికి శాలువా కప్పిన ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్
- 6.25:జయజయహే తెలంగాణ గీతాలాపన
- 6.30: లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసిన సీఎం, అనంతరం ప్రసంగం, 33 నిమిషాల పాటు మాట్లాడిన సీఎం
- 7.30కు సభావేదిక నుంచి సీఎం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు పయనం
- అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్ ఎమ్మెల్సీలుగా ఈ రోజు నుంచి బాధ్యతల్లోకి వచ్చారని ప్రస్తావించిన సీఎం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సీఎం ప్రసంగంలో మాజీ మంత్రి జానారెడ్డి గురించి రెండు సందర్భాల్లో ప్రస్తావించడంతోపాటు, టీడీపీ సిద్ధాంతాల రూపకల్పనలో భాగస్వామ్యమైన కేవీ. సత్యనారాయణ పేరును కూడా సీఎం ప్రస్తావించారు.


సీఎం సభకు హాజరైన ప్రజలు

వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాల్లో భక్తుల సందడి
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు, అలరించిన కవి సమ్మేళనాలు



బీఆర్ఎస్ కార్యాలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరాది సందర్భంగా ఉగాది వేడుకలను జిలావ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రజలు సమీప ఆలయాలకు చేరుకుని ఇష్టా దైవానికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో ఆలయాన్ని భక్తులతో కిటకిటలాడాయి. గృహాలు, వ్యాపార సంస్థలను మామిడి తోరణాలతో అలంకరించి పూజల అనంతరం, తీపి, చేదు, కారం, ఉప్పు, పులుపు, వగరుల మిశ్రమంతో తయారు చేసిన షడ్రుచుల ఉగాది పచ్చడిని మహా ప్రసాదంగా స్వీకరించారు. బంధువులకు, స్నేహితులకు ఉగాది పచ్చడి వితరణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల ఉగాది కవి సమ్మేళనాలు నిర్వహించారు. సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో యూటీఎఫ్ కార్యాలయంలో కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఉగాది వేడుకలు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని ఉగాది పురస్కారాలతో సత్కరించారు.



వ్యవసాయ పరికరాల పంపిణీకి సన్నాహాలు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి తొలి విడతగా ఉమ్మడి జిల్లాలో 1,552మంది రైతులకు రూ.3.59కోట్లు కేటాయించింది. ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పథకాన్ని నిరంతర ప్రక్రియగా చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించి కార్యాచరణ అమలుచేస్తోంది. ఇప్పటి వరకు 50కిపైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండగా, వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ మాసంలో రైతులకు పరికరాలు అందజేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ
- ఏప్రిల్‌లో పంపిణీకి ఏర్పాట్లు
- తొలి విడతకు ఇప్పటికే 50శాతం పైగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 1,552మంది లబ్ధిదారులు

ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తీసుకువచ్చింది. కాగా, ఈ పథకం ఆరేళ్లుగా నిలిచిపోవడంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశం లేకుండా పోయింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కొనసాగించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్ల సుమారు రూ.50కోట్లు కేటాయించింది. అయితే యాంత్రీకరణ పథకంలో అత్యధికంగా ట్రాక్టర్లను మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్లు అధికంగా టీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారన్నా ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున రావడంతో పథకం అబాసుపాలైంది. మరికొన్ని పరికరాలను కూడా రాయితీపై ఇచ్చినా రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. పథకం అమలు విమర్శలపాలు కావడంతో అప్పటి 2018లో అప్పటి ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. ఆ తరువాత రైతులు, రైతు సంఘాల నేతలు ఈ పథకం అమలు కోసం డిమాండ్ చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని తిరిగి అమలులోకి తీసుకురాలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పునరుద్ధరించింది.

వచ్చే నెలలో రాయితీపై యంత్రాలు...

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు నిర్ణయించడమేగాక ఈ యాసంగిని నుంచే రైతులకు రాయితీపై యంత్రాలు అందజేయాలని భావించింది. అయితే కొంత ఆలస్యం కాగా, సీజన్ ముగిసేలోగా ఈ నెలాఖరు వరకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వచ్చే నెలలో పరికరాలు కేటాయించనున్నారు. రైతులకు అవసరమైన ఉపకరణాలు, యంత్రాలను రాయితీపై సరఫరాకు జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వ్యవసాయ అధికారుల...

- మిగతా 7వ పేజీలో...

నేడు ఈదుల్ ఫితర్

- సామూహిక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు
- ముగిసిన ఉపవాస దీక్షలు


జిల్లా కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మునుగోడు రోడ్డులోని ఈద్గా

నల్లగొండ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెలవంక ఆదివారం కనిపించడంతో ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగను ముస్లింలు సోమవారం నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు ఆదివారం ఇఫ్తార్‌తో దీక్షలను విరమించారు. సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగకు అంతా సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రం మునుగోడురోడ్‌లోని ఈద్గాలో సామూహిక ప్రార్థనల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరవుతున్నందున పోలీస్‌శాఖ కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం 8.30గంటలకు ఈద్గాలో సామూహిక ప్రార్థనలు ఉంటాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు. పండుగ సందర్భంగా ప్రతీ ముస్లిం ఇంటా షీర్ ఖుర్మా తయారు చేసేందుకు సామగ్రి కొనుగోలు, అదేవిధంగా కొత్త దుస్తుల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడాయి. పేద ముస్లింలకు ఇప్పటికే ఫిత్రా, జకాత్‌ను, పలు సంస్థలు పండుగ సామగ్రిని పంపిణీచేశాయి. రంజాన్ మాస ప్రత్యేక వంటకం హరీస్, హలీం తయారుచేసే కేంద్రాలు పండుగ అనంతరం మూతపడనుండటంతో ఆదివారం సాయంత్రం ఇవి బిజీగా మారాయి. కాగా, రంజాన్ రోజున ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాల వద్ద ఏర్పాట్లను ముస్లిం మత పెద్దలు, పలువురు అధికారులు ఆదివారం సాయంత్రం పరిశీలించారు.

రేపటి నుంచి వ్యవసాయశాఖలో కొత్త సెల్ నెంబర్లు

నల్లగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులకు కొత్త సెల్‌ఫోన్ నెంబర్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జేడీఏ పి.శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న నెంబర్ల స్థానంలో కొత్త నెంబర్లు అందుబాటులోకి రానున్నాయి. జేడీఏ, ఏడీఏలు, ఎంఏవోలు, టెక్నికల్ ఆఫీసర్లు, ఏవోల నెంబర్లు మారాయి.

అధికారి	కొత్త నెంబర్
జిల్లా వ్యవసాయాధికారి	8977751294
నల్లగొండ ఏడీఏ-టీ(డీఏవో)	8977751295
దేవరకొండ ఏడీఏ	8977751306
హాలియా ఏడీఏ	8977751330
మిర్యాలగూడ ఏడీఏ	8977751358
మునుగోడు ఏడీఏ	8977751370
నకిరేకల్ ఏడీఏ	8977751427
నల్లగొండ ఏడీఏ	8977751449
డీడీఏఎఫ్‌టీసీ నల్లగొండ	8977751458

మల్లాచారికి ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న మల్లాచారి

కనగల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశీపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ ముఖ్య అర్చకుడు నాగోజు మల్లాచారికి ఉగాది పురస్కారం లభించింది. రాష్ట్ర భాషాసాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయశాఖ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శ్రీవిశ్వావసునామ సంవత్సరం ఉగాది సందర్భంగా నిర్వహించిన పంచాంగ శ్రావణం మల్లాచారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉగాది పురస్కారం అందజేసి సన్మానించారు. కాగా, పురస్కారం దక్కడం ఎంతో ఆనందంగా ఉందని, తనను ఎంపిక చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'సన్నబియ్యం సరిపడా సరఫరా చేయాలి'

మిర్యాలగూడటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం సరిపడా సరఫరా చేయాలని లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకుడు బెలిదె వీరప్రతాప్ కోరారు. ఆహార భద్రత పథకంలో భాగంగా లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడం హర్షనీయమన్నారు. అయితే లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా దుకాణాల్లో సన్నబియ్యం అందుబాటులో ఉంచాలన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి: సీపీఎం

చింతపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుగుంట్ల రాములు డిమాండ్ చేశారు. ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు.

వృద్ధులకు బాసటగా..

- చింతపల్లిలో 13 ఏళ్లుగా కొనసాగుతున్న ఆదర్శ వృద్ధుల కేంద్రం
- మలిసంధ్యలో విశేష సేవలు
- ఆదర్శంగా నిలుస్తున్న శంకరాచారి



చింతపల్లిలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో శంకరాచారి

రెండు జిల్లాల కూడలి ప్రముఖ వ్యాపార విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల (వేంకటేశ్వరనగర్)కు చెందిన కృష్ణామాచారి,జంగమ్మ దంపతుల కుమారుడు సొల్లేటి శంకరాచారి. ఆయన మొదట వీఆర్వో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించేవారు. దీంతో వృద్ధులకు వైద్య సేవలు కల్పించే తరుణంలో వృద్ధాశ్రమం స్థాపించాలనే ఆలోచన కలిగింది. తనతో ఏకీభవించిన ఆరుగురిని కలుపుకొని చింతపల్లిలో నాలుగు గదుల ఇంట్లో ఆదర్శ వృద్ధాశ్రమాన్ని 2012 సంవత్సరంలో ప్రారంభించారు. ఎలాంటి ఆదరువు లేని వృద్ధులు వచ్చి చేరే వారికి ఉచితంగా సేవలు చేస్తున్నారు.

వృద్ధులు అనారోగ్యానికి గురైతే వెంటనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. దీంతో పాటు కొంత మంది నేత్ర సంబంధమైన వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేయించి వారి జీవితంలో వెలుగులు నింపుతున్నాడు.

సమాజం ఎవరికి వారే యమునతీరే అన్న చందంగా మారింది. దానికి విరుద్ధంగా వయోవృద్ధుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సోల్లేటి శంకరాచారి. ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అనే స్ఫూర్తితో ఏ అండా లేని వృద్ధులకు బాసటగా నిలుస్తున్నారు. కొంత మంది దాతల సహకారంతో చింతపల్లి మండల కేంద్రంలో ఆదర్శ వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నారు. మలి వయస్సులో వారిని కంటికి రెప్పలా చూసుకుంటూ రక్షణ కల్పిస్తున్నారు.

\- (ఆంధ్రజ్యోతి, చింతపల్లి)

దాతల సహకారంతో నిర్వహణ

చింతపల్లిలో ఆదర్శ వృద్ధాశ్రమాన్ని 2012 సంవత్సరంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. వృద్ధాశ్రమాన్ని సందర్శించిన వారు ఇక్కడి నిర్వహణ తీరు చూసి సంతృప్తి చెంది తమవంతు సహకారం అందిస్తున్నారు. ఆశ్రమం సుమారు అర ఎకరం విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఆశ్రమంలో 20 మందికి పైగా వృద్ధులు వసతి పొందుతున్నారు. వీరికి భోజనం కోసం కొంతమంది బియ్యం పప్పు, కురగాయలు, పాలు ఉచితంగా అందిస్తున్నారు. కాలక్షేపం కోసం దినపత్రికలు, పుస్తకాలు రెండు టీవీలు ఏర్పాటు చేశారు. రోజూ భోజనంతో పాటు ప్రతీ సోమవారం ఆశ్రమంలో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు.

కష్టాలను మరిపోయాం



ఆదర్శ ఆశ్రమంలో మేమంతా వృద్ధాప్యం మరిచి కలిసిమెలిసి కష్టసుఖాలను పంచుకుంటున్నాం. పగలంతా ఆధ్యాత్మిక విషయాలు మాట్లడుకుంటూ బాధలు మరిచిపోతున్నాం. ఇక్కడ ఆశ్రయం పొందటం చాలా సంతృప్తిగా ఉంది.

\- ఎడుకొండ్ల రాములమ్మ, బ్రాహ్మణపల్లి

చాలా సంతోషంగా ఉంది



ఆశ్రమంలో మాకు ఎంతో సౌకర్యంగా ఉంది. వృద్ధాశ్రమంలో మాతోటి వారితో కలిసి మెలిసి సంతోషంగా ఉంటున్నాం. సమయానికి భోజనం చేస్తుండటంతో ఆరోగ్యంగా ఉంటున్నాం. ప్రతీ వారం ఆశ్రమ నిర్వాహకుడు వైద్యుడు శంకరాచారి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నాడు.

\- ఎండి.మహ్మద్, చింతపల్లి

సేవలను మరింతగా విస్తరిస్తాం



ఆదర్శ వృద్ధాశ్రమాన్ని విస్తరించి మరిన్ని సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందరి సహకారంతో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నాం. ఆశ్రమంలోని వృద్ధులకు సేవ చేయడం ఎంతో సంతృప్తి కలిగిస్తుంది. సమాజంలోని వయో వృద్ధులకు ఏ అండలేని వారికి వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. నిస్వార్థంతో పని చేయడంతో అందరి సహకారం లభిస్తుంది.

\- సొల్లేటి శంకరాచారి, ఆదర్శ వృద్ధాశ్రమం నిర్వాహకుడు

ధ్రువీకరణ పత్రాల కోసం ప్రదక్షిణలు

● తహసీల్దార్ కార్యాలయంలో పేరుకుపోయిన దరఖాస్తులు



తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం

తిరుమలగిరి(సాగర్), మార్చి 30(ఆంధ్రజ్యోతి): కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంతో పాటు పలు అవసరాల నిమిత్తం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు కుల, ఆదాయంతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేశారు. ఈ క్రమంలో వారం రోజులుగా కార్యాలయానికి అందిన దరఖాస్తులు సుమారు వెయ్యికి చేరుకున్నట్లు సంబంధిత తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. ఐదు రోజులుగా తహసీల్దార్ కార్యాలయ సర్వర్ స్లో కావడంతో దరఖాస్తులు ఎక్కడికక్కడే పేరుకొని పోయాయి. దీనివల్ల దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు పొందడం ఇబ్బందిగా మారింది. ప్రధానంగా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకోవడానికి వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర వర్గాలకు చెందిన దరఖాస్తుదారులు ప్రతీరోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పరిస్థితి చోటు చేసుకుంటుంది. ఏప్రిల్ 5వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండడంతో పాటు గడువు సమీపంలోనే ఉండటంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. మీసేవా, ఇతర ఆన్‌లైన్ కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవడానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని పలు గ్రామాల లబ్ధిదారులు పేర్కొనడం గమనార్హం.

చదువుతోనే ఉన్నత స్థితి సాధ్యం



బంకాపురంలో ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ, చిటిపోలు యాదిగిరి

నిడమనూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉన్నత స్థితి సాధ్యమవుతుందని, కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందని క్యూరియా ఇండియా లిమిటెడ్ కంపెనీ హెడ్ సీనియర్ డైరెక్టర్ వల్లూరి మురళీకృష్ణ, జిల్లా రైస్ మిల్లర్స్ గౌరవాధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. మండలంలోని బంకాపురంలో పాఠశాల ఆవరణలో ఆదివారం అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ మురళీకృష్ణ సౌజన్యంతో రూ.2.50 లక్షల విలువతో ఓపెన్ జిమ్, షటిల్, వాలీబాల్ కోర్టులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని తాము ఉన్నత స్థితికి వచ్చామని, పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామానికి ఫ్రీజర్ ఇస్తానని మురళీకృష్ణ హామీ ఇచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో పేలపూడి బాలకృష్ణ, ఉన్నం చినవెంకటేశ్వర్లు, రాయపాటి పేరయ్య, పాంపాటి యాదగిరి, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కుక్కడపు రమేష్, గుండం రాజు, రామారావు, సుదేశ్వరరావు, గుండాడా లింగయ్య, రామయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, నరేష్, శ్రీనివాసరావు, రాంబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సత్యనారాయణకు డాక్టరేట్



తమిళనాడు హోసూర్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న సత్యనారాయణ

మిర్యాలగూడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు అకాడమీ పుస్తక రచయిత, పలివెల ప్రధానోపాధ్యాయులు ఆదె సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ లభించింది. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన ఆయన ప్రముఖ అధ్యాపకులు, పోటీపరీక్షల నిపుణులు విద్యారంగంలో వారు చేసిన కృషికి, విశిష్ట సేవలను గుర్తించి తమిళనాడు హోసూర్ ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ మార్చి 29వ తేదీన గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. హోసూర్‌లో జరిగిన ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖులు ఆయనకు డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తూ కొన్నేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అభ్యర్థులకు టీషర్ట్ మన టీవీ ద్వారా వీడియో పాఠ్యాంశాల బోధనలోనూ, ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అకాడమీల ద్వారా జనరల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో ప్రామాణిక పుస్తకాల రూపకల్పనలో భాగస్వామ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఎంసెట్ శిక్షణ తరగతులలో భౌతిక శాస్త్ర క్లాసులను బోధిస్తున్నట్లు తెలిపారు. డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ కేపీ మనోకర్, డాక్టర్ కరాటే ఏపీ శ్రీనాథ్, ఆదిత్య స్వామీజీ, గుణశేఖర్, దేవసింగమని, రవిచంద్రన్, అరుణ్ చిన్నదొరై, స్మిత తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

నాగార్జునసాగర్, మార్చి30(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నందికొండ మునిసిపాలిటీ హిల్‌కాలనీలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మైనారిటీ, యూనిటీ ఆఫ్ ఉమ్మహ్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. రంజాన్‌ను ఆనందోత్సవాలతో నిర్వహించుకోవాలని అన్నారు. పట్టణానికి చెందిన 20 మంది పేద ముస్లిం మైనారిటీలకు రంజాన్ తోఫాను మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులు సయ్యద్ షబ్బీర్, ఎస్.కె గౌస్, ఎస్.కె అజ్గర్, రహమత్ అలీ, ఎండీ ముజ్జు, సుబానీ, ఎండీ గని, అన్వర్, హమీద్, ఖాసీం, బాష, చంటి, నాగూర్, నసీర్, షరీఫ్ పాల్గొన్నారు.



తోఫా అందిస్తున్న ముస్లిం, మైనార్టీ అసోసియేషన్ సభ్యులు

ఆనందోత్సాహాలతో ఉగాది వేడుకలు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్ : శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అన్ని ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ నెలకొన్నది. దేవరకొండ రామాలయంలో వేదపండితులు ఆలయ ప్రధాన అర్చకులు మార్పాల శ్రీనివాస్‌శర్మ పంచాంగ శ్రావణం చేశారు. ఈ సంవత్సరం పంటలు బాగా పండుతాయని, వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని, రైతులకు మేలు జరుగుతుందని పండితులు తెలిపారు. సాయిబాబా ఆలయంలో జరిగిన పంచాంగ శ్రావణంలో బ్రహ్మణసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణం చేశారు. శ్రీవాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ, వాసవీ వనితక్లబ్ ఆధ్వర్యంలో పంచాంగాన్ని దేవరకొండ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ ఆవిష్కరించారు. నిడమనూరు, మండలంలోని కోటమైసమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి కనిపించింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో పూజలు చేశారు. కొండమల్లేపల్లి ఆయా దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



దేవరకొండలో పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వాసవీ క్లబ్, వనితా క్లబ్ సభ్యులు



మిర్యాలగూడలో హిందూవాహిని ప్రతినిధులతో కలిసి ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న కరుణాకర్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని హిందూ వాహిని ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక కార్యకర్త చెరుపల్లి కరుణాకర్ మాట్లాడుతూ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు జాతిని సజీవంగా ఉంచుతాయన్నారు. కార్యక్రమంలో ప్రతినిధి పెదబోయిన వెంకటరమణ, వాహిని అక్కినపల్లి సుధాకర్, మధు, ఉదయ్, నాగరాజు, చరణ్, బాలకృష్ణ, ప్రీతంరాజు, అభి, అజయ్ పాల్గొన్నారు. మిర్యాలగూడ టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి మాట్లాడుతూ విద్యార్థులకు విలువలు నేర్పడంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముందుంటుందన్నారు. చింతపల్లి మండలం గొడుకొండలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజారి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, పూజారి వైద్యుల ప్రవీణ్‌శర్మ, ధర్మకర్తలు మద్దెల కృష్ణ, సురిగి జంగయ్యగౌడ్, కడారి జంగయ్య, పోలేపల్లి నరేష్, బొడ్డు మధు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

కొండమల్లేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఆదివారం కొండమల్లేపల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ మాట్లాడుతూ అరెస్టులు అప్రజాస్వామికమని అన్నారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రమావత్ శ్రీనునాయక్, రమావత్ దీప్లానాయక్, శంకర్‌నాయక్, లచ్చిరాంనాయక్, బాలునాయక్, ఆంబోతు శంకర్‌నాయక్, మనుమంతునాయక్, మునినాయక్ తదితరులు ఉన్నారు.



కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

వేధిస్తోన్న లోవోల్టేజీ సమస్య

● తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు ● ఆందోళన లో ప్రజలు, రైతులు



కొండమల్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

కొండమల్లేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ సబ్ డివిజన్‌లో ఎండలు మండిపోతుండడంతో విద్యుత్ లోవోల్టేజీ సమస్య మొదలైంది. కొండమల్లేపల్లి దేవరకొండ, చందంపేట, పీఏపల్లి, మండలాల్లోని గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉందని, తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు డివిజన్ పరిధిలో సుమారు 50వేల ఎకరాల వరకు యాసంగి వరి సాగు చేశారు. ఏమ్మార్పీ, డిండి ప్రాజెక్టు పరిధిలో నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ చందంపేట, నేరేడుగొమ్ము, కొండమల్లేపల్లి మండలంలోని గ్రామాల్లో రైతులు బోరు బావుల వద్ద వరితో పాటు కూరగాయ సాగు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే డివిజన్ పరిధిలోనిసమస్య పరిష్కారానికి దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చొరవ తీసుకొని రూ.15 కోట్లతో ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయించారు. టెండర్లు పూర్తయి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సబ్‌స్టేషన్ల పనులు ప్రారంభమవుతున్నాయని విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు. కాగా సమస్య ఉన్న మండల కేంద్రాల్లో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

కాలిపోతున్న ఎలక్ట్రికల్ సామగ్రి

కొండమల్లేపల్లి మండల కేంద్రంతో పాటు జానిగానీతండా, ఆంబోతుతండా, చిన్నఅడిశర్లపల్లి గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని రైతులు, ప్రజలు తెలుపుతున్నారు. విద్యుత్ లోవోల్టేజి సమస్యతో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గల దేవరకొండ రోడ్డులోని ఇంద్రపురం కాలనీ, అంబేడ్కర్ నగర్ కాలనీతో పాటు విద్యుత్ బల్బులు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, మిక్సీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయని, విద్యుత్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంట్లో సామగ్రి కాలిపోతున్నాయి



లోవోల్టేజి సమస్య కారణంగా ఇళ్లల్లో ఫ్యాన్లు తిరగడం లేదు. ఇళ్లల్లోని మోటార్లు కాలిపోతున్నాయి. ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

బొడ్డుపల్లి శంకర్, కొండమల్లేపల్లి

పై అధికారులకు విన్నవించాం

కొండమల్లేపల్లిలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ఇంద్రపురం కాలనీలో సింగల్ ఫేజ్ వల్ల లోవోల్టేజి సమస్య ఉన్న మాట వాస్తవమే. సమస్య పరిష్కారానికి పై అధికారులకు విన్నవించాం. త్వరలోనే కాలనీలో స్తంభాలు ఏర్పాటు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అంబేడ్కర్ నగర్ కాలనీలో వినియోగదారులు స్తంభాలకు వైర్లు వేయడం వల్ల షార్ట్ సర్క్యూట్ అయి సమస్యలు తలెత్తుతున్నాయి. త్వరలోనే వాటికి కూడా పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

దేవోజీనాయక్, ఏఈ, కొండమల్లేపల్లి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

నిడమనూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముప్పారం గ్రామంలో పురాతన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన హోమం, సంప్రోక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పండితులు, ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యడవెల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు గణపురం సత్యనారాయణ, మర్రి శ్రీను, పున్నయ్య, నాగమ్మశ్రీను, నాయకులు అంకతి సత్యం, వల్లభ్‌రెడ్డి, నందికొండ మట్టారెడ్డి, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, కృష్ణ ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.



ముప్పారం ఆలయంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా

నాగార్జునసాగర్: కష్టకాలంలో తన వెంట నడిచిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు తాను అండగా ఉండానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ నందికొండ మునిసిపాలిటీ పైలాన్ కాలనీకి చెందిన యువజన కాంగ్రెస్ కార్యకర్త రోషన్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో ఆయన మిర్యాలగూడ పట్టణంలోని అపోలో రీచ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఆదివారం ఉదయం మిర్యాలగూడ ఆస్పత్రిలో రోషన్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అపోలో రీచ్ డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. తమను నమ్ముకున్న ప్రతి కార్యకర్తకి జానారెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగరాజు, ఖాసీం, ఉపేందర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న పాల్వాయి వెంకట్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నల్లగొండ సూర్య హాస్పటల్ అధినేత డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు, పీఏపల్లి మండలకేంద్రంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని సూర్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భం గా ప్రజలకు ఉగాది పచ్చడి, చల్లటి నీళ్లను పంపిణీ చేశారు. అనంతరం మండలకేంద్రంలో పార్కు ప్రదేశం నిరుపయోగంగా ఉందని గ్రామస్థులు తెలియజేశారు. వెంటనే సొంత నిధులతో పార్కులోని ముళ్ల పొదలను శుభ్రం చేయించారు. యువకులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటీ సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు తేరా సత్యనారాయణరెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోర్ల సైదమ్మశ్రీనివాస్, రమావత్ పాండునాయక్, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వీరమళ్ల సతీష్‌కుమార్, కోటేష్, శంకర్, ముత్తయ్య, కుశలయ్య, ఉప్పల కోటి, సంకు జాన్‌రెడ్డి, మహేందర్, శివశంకర్ పాల్గొన్నారు.